Follow: @ANNTELUGU
09-04-2026
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 102 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఆదిలాబాద్‌లో అతిపెద్ద విమానాశ్రయం నిర్మాణం

### మూడు నెలల్లో మామునూరుకు శంఖుస్థాపన

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**ఢిల్లీ, మహా:** మామునూరు ఎయిర్‌పోర్టుకు మరో మూడు నెలల్లో శంకుస్థాపన చేయాలని భావిస్తున్నట్లుగా కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. తెలంగాణలో ఎయిర్‌పోర్టులపై వస్తున్న అన్ని డిమాండ్లను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. ఫీజబులిటి ఉన్న చోట ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నామన్నారు.

**ఆదిలాబాద్‌లో పెద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణం**

ఆదిలాబాద్‌లో సైనిక, పౌరుల అవసరాలకు అనుగుణంగా పెద్ద ఎయిర్‌పోర్టు నిర్మించాలని కేంద్రం భావిస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇక్కడ సైన్యానికి శిక్షణతో పాటు సివిల్ ఏవియేషన్ అవసరాల కోసం వాడాలని రక్షణశాఖ మంత్రి చెప్పినట్లు గుర్తుచేశారు. ఈనెల 17న ఆదిలాబాద్ భూముల పరిశీలనకు అధికారులు వెళ్తారని, రక్షణశాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశాక తుది నిర్ణయం తీసుకుంటామని

మిగతా 2లో

టాప్ న్యూస్



### రాఘవ్ చడ్డా కొత్త రాజకీయ పార్టీ?

- సోషల్ పోస్టులతో సంకేతాలు


02



02

### సామాన్యుడిలా మంత్రి ముచ్చట

మెట్రోలో జూపల్లి ప్రయాణం




02

### సామాన్యుడికి ఊరట

మారని రేపోరేటు.. వడ్డీ రేట్లు యథాతథం

వరుసగా రెండోసారి మార్పులు చేయని రిజర్వ్ బ్యాంక్

# సీజ్‌ఫైర్‌పై అనిశ్చితి

## ఇరాన్‌కు ఆయుధాలిస్తే 50 శాతం సుంకం

### డొనాల్డ్ ట్రంప్ సంచలన హెచ్చరిక

### కాల్పుల విరమణ ప్రకటన.. గంటల్లోనే 'టారిఫ్' బాంబు

### లెబెనాన్ పై ఇజ్రాయెల్.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు

### 10 నిమిషాల్లోనే 100కు పైగా వైమానిక దాడులు

**మహా నెట్ వర్క్**

యుద్ధం ప్రళయాన్ని తలపించి ఆగిపోతోంది. ఆగిపోయినట్లు కనిపించి.. మళ్ళీ మొదలవుతోంది. గత నెలన్నర కాలంగా ఇరాన్ తగ్గేదే లేదన్నట్లుగా వ్యవహరిస్తుండగా, అమెరికా గెలిచే దారేది అంటూ అడ్డగోలు డెడ్ లైన్లు పెట్టి పరువుకాపాడుకోవడానికి తంటాలు పడుతోంది. పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక సీజ్‌ఫైర్‌పై మళ్లీ అనిశ్చితి నెలకొంది. రెండు వారాల పాటు యుద్ధ విరమణకు ఇరుదేశాలు అంగీకరించినప్పటికీ, తాజా పరిణామాలు కీలక మార్పు జరిగినట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం కావడంతో హర్మూజ్ జలసంధి ద్వారా చమురు ట్యాంకర్ల రాకపోకలను నిలిపివేసినట్లు ఇరాన్ అధికార మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్‌బొల్లాపై దాడులు పెరగడం ఇరాన్‌ను ఆగ్రహానికి గురి చేసిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సీజ్‌ఫైర్ ఒప్పందం మంగళవారం ప్రారంభమైనప్పటికీ, అది అన్ని ప్రాంతాలకు వర్తించదని స్పష్టం చేశారు. అలాగే, లెబనాన్ ఈ ఒప్పందంలో భాగం కాదని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో




## ఖర్చుగా కాదు... భాగస్వామ్యంగా చూడండి...

### ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి.. అవసరమైన సహకారం మేం అందిస్తాం

### కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని

మిగతా 2లో

MINA SUPER SPECIALITY HOSPITAL PRESENTS

A GRAND FREE HEALTH CAMP FOR HAJ PILGRIMS

ATTAPUR, HYDERABAD – IN A NOBLE INITIATIVE TO SUPPORT AND SAFEGUARD THE HEALTH OF HAJ PILGRIMS, MINA SUPER SPECIALITY HOSPITAL PROUDLY ANNOUNCES A MEGA FREE HEALTH CAMP ON 9TH, 10TH, AND 11TH APRIL 2026 AT ITS PREMISES, PILLAR NO. 254, ATTAPUR, HYDERABAD.THIS SPECIALLY CURATED CAMP ENSURES THAT PILGRIMS EMBARK ON THEIR SACRED JOURNEY WITH CONFIDENCE, FITNESS, AND PEACE OF MIND.

EXPERT MEDICAL CARE UNDER ONE ROOF
- General Medicine: Dr. Jawad
- Ophthalmology (Eye Care): Dr. Hidayatulla Khan & Dr. Basith Hussain
- Gynaecology: Dr. Soheba Shukoor

EXCLUSIVE FACILITY FOR LADY PILGRIMS

A dedicated 3rd Floor section has been arranged exclusively for lady Haj pilgrims, ensuring privacy and comfort with consultations by Dr. Soheba Shukoor.

COMPLETELY FREE SERVICES INCLUDE
- BP & Blood Sugar Check-ups
- ECG (if required)
- Eye Examination with FREE Spectacles for Haj pilgrims
- Laboratory Tests as advised
- Medicines during the camp

ADDITIONAL FACILITIES
- Lunch will be provided for all registered pilgrims
- Separate Namaz (prayer) area available within the hospital premises
- Same benefits will be extended to Haj pilgrims visiting from other districts

INAUGURATION
- The camp will be grandly inaugurated on 9th April 2026 by
- Hazrat Maulana Syed Shah Ghulam Afzal Biyabani Khusro Pasha Sahib
- Sajjada Nashin of Dargah Shareef Qazipet & President of Telangana State Haj Committee

PRE-BOOKING OPENS FROM MONDAY, 6TH APRIL 2026

SECURE YOUR SLOT BY CALLING:

• 040-35262700 • 040-35262701 • 7396084445 • 7396084446



PREPARE FOR YOUR SACRED JOURNEY WITH HEALTH, CARE, AND BLESSINGS.

DON'T MISS THIS GOLDEN OPPORTUNITY! ISSUED IN PUBLIC INTEREST BY:MINA SUPER SPECIALITY HOSPITAL

# రాఘవ్ చడ్డా కొత్త రాజకీయ పార్టీ?

## సోషల్ పోస్టులతో సంకేతాలు

**మహా :** ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చడ్డా కొత్త పార్టీ పెట్టబోతున్నారా? పార్టీతో విభేధాల నేపథ్యంలో రాఘవ్ చడ్డా కీలక వ్యాఖ్యలు చేశారు. మరో రాజకీయ పార్టీలో చేరడం కంటే సొంత పార్టీని ప్రారంభించాలని ఓ యూజర్ సూచించగా, మంచి ఆలోచన (ఇంట్రెస్టింగ్ థాట్) అంటూ కామెంట్ చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వీడియోను పంచుకున్నారు. దీంతో రాఘవ్ చడ్డా కొత్త పార్టీ పెట్టనున్నారనే ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. ఇదిలా ఉండగా ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను పరోక్షంగా విమర్శించారు. "మాస్టర్ కంటే ఎప్పుడూ గొప్పగా రాణించవద్దు" అనే శీర్షికతో ఉన్న ఒక పుస్తక చిత్రాన్ని ఎంపీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. అంతకుముందు రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపనేతగా రాఘవ్ చడ్డాను తొలగించింది ఆప్. ఆయన స్థానంలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చడ్డా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. రాఘవ్ చడ్డా బీజేపీలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశగా మారింది.

# సీజ్‌ఫైర్‌పై అనిశ్చితి

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో ప్రపంచ దేశాలను వణికించే ఆర్థిక నిర్ణయాన్ని ప్రకటించారు. ఇరాన్‌తో రెండు వారాల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న కొద్ది గంటల్లోనే, ఆయన ఒక శక్తివంతమైన హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్‌కు సైనిక ఆయుధాలను లేదా యుద్ధ సామగ్రిని సరఫరా చేసే ఏ దేశానికైనా అమెరికా గట్టి గుణపాఠం చెబుతుందని, ఆయా దేశాల నుండి అమెరికాకు ఎగుమతి అయ్యే అన్ని రకాల వస్తువులపై తక్షణమే 50 శాతం అదనపు సుంకాన్ని విధిస్తామని ఆయన ప్రకటించారు. తన 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ సంచలన నిర్ణయాన్ని వెల్లడించిన ట్రంప్, ఈ విషయంలో ఎవరికీ ఎటువంటి రాయితీలు లేదా మినహాయింపులు ఉండబోవని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. పశ్చిమ ఆసియాలో గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చేసిన మధ్యవర్తిత్వం ఫలించింది. ఇరాన్ మరియు అమెరికా మధ్య 15 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేసేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్ అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన 'హార్ముజ్ జలసంధి'ని తిరిగి తెరిచేందుకు సమ్మతించింది. అయితే, ఈ శాంతి చర్చలు కొనసాగుతున్న తరుణంలోనే ట్రంప్ ఈ 'టారిఫ్' అస్త్రాన్ని ప్రయోగించడం గమనార్హం. ఇరాన్ తన సైనిక బలాన్ని పెంచుకోకుండా పూర్తిగా ఒంటరిని చేయడమే లక్ష్యంగా ఆయన ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఒకవైపు ఇరాన్‌తో శాంతి చర్చలకు సిద్ధమంటూనే, మరోవైపు ఆ దేశానికి సహకరించే దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తామని హెచ్చరించడం ట్రంప్ మార్క్ దౌత్యానికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ 50 శాతం సుంకం విధింపు నిర్ణయం చైనా వంటి దేశాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇరాన్‌కు డ్రోన్లు మరియు ఇతర సైనిక విడిభాగాలను సరఫరా చేస్తున్న దేశాల జాబితాను అమెరికా నిశితంగా పరిశీలిస్తోంది. అమెరికా వంటి అతిపెద్ద మార్కెట్‌కు తమ వస్తువులను ఎగుమతి చేసే దేశాలు, ఇప్పుడు ఇరాన్‌కు సహకరిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ట్రంప్ ప్రకటించిన ఈ కఠినమైన విధానం వల్ల ప్రపంచ సరఫరా గొలుసు దెబ్బతినే ప్రమాదం ఉన్నప్పటికీ, అమెరికా ప్రయోజనాలే తమకు ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌లో 'ప్రోత్సాహకరమైన మార్పులు' వస్తున్నాయని వ్యాఖ్యానించిన ట్రంప్, ఆ దేశ అణు కార్యక్రమాలపై కూడా అమెరికా గట్టి నిఘా ఉంచుతుందని స్పష్టం చేశారు.

పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఒక గొప్ప విజయంగా అభివర్ణించినప్పటికీ, ట్రంప్ హెచ్చరికతో అంతర్జాతీయ సమాజం ఇప్పుడు డైలమాలో పడింది. ఒకవేళ ఏ దేశమైనా ఇరాన్‌కు రహస్యంగా ఆయుధాలు సరఫరా చేస్తే, ఆ దేశ ఆర్థిక వ్యవస్థను అమెరికా టారిఫ్‌లతో కుప్పకూల్చే ప్రమాదం ఉంది. ఈ తాత్కాలిక కాల్పుల విరమణ రెండు వారాల తర్వాత శాశ్వత శాంతి ఒప్పందానికి దారితీస్తుందా లేదా అనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. అయితే, మధ్య ప్రాచ్యంలో ఒక 'స్వర్ణ యుగం' రాబోతోందని, పునర్నిర్మాణ కార్యక్రమాల్లో అమెరికా చురుగ్గా పాల్గొంటుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ టారిఫ్ పెంపు నిర్ణయం ప్రపంచ స్టాక్ మార్కెట్లు, వాణిజ్య వర్గాల్లో పెను సంచలనంగా మారింది.

**మళ్ళీ దాడులు**

హెజ్‌బొల్లాపై దాడులు ఆపబోమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేసిన కొద్ది గంటల్లోనే లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పెద్ద ఎత్తున దాడులకు పాల్పడింది. కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే ఐడీఎఫ్ జరిపిన భీకర దాడుల వల్ల అనేక మంది మృతిచెందారు. వందల సంఖ్యలో గాయపడ్డారు. రాజధాని బీరూట్, సైడా, టైర్ వంటి ప్రాంతాల్లోని నివాస ప్రాంతాలు, ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే చోట్ల బాంబు దాడులు జరిగాయి. 100కు పైగా అంబులెన్సులు సహాయక చర్యల్లో పాల్గొన్నాయని అధికారులు తెలిపారు. లెబనాన్‌లోని ఆస్పత్రులు క్షతగాత్రులతో కిక్కిరిసినట్టు చెప్పారు. లెబనాన్‌లోని 100కు పైగా హెజ్‌బొల్లా స్థావరాలపై ఏకకాలంలో దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇప్పటి వరకు లెబనాన్‌లో చేపట్టిన అతిపెద్ద సమన్వయ దాడి ఇదేనని పేర్కొంది. హెజ్‌బొల్లా కమాండ్ సెంటర్లు, ఆయుధ గిడ్డంగులు, ఇతర సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపినట్టు తెలిపింది. లెబనాన్‌లోని సాధారణ పౌరులకు నష్టం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. లెబనాన్‌లో 1982 తర్వాత ఎన్నడూ లేని విధంగా, కేవలం 10 నిమిషాల వ్యవధిలో 100కు పైగా వైమానిక దాడులు జరిగాయి. సాధారణంగా హెజ్‌బొల్లాకు సంబంధం లేని ప్రాంతాలుగా భావించే బీరూట్‌లోని సున్నీ నివాస ప్రాంతాలపై కూడా దాడులు జరిగాయి. ఇరాన్ విషయంలో తమ ప్రమేయం లేకుండా అమెరికా నిర్ణయం తీసుకున్నప్పటికీ, లెబనాన్ యుద్ధం ఎలా ముగియాలనేది తామే నిర్ణయిస్తామని ఇజ్రాయెల్ ప్రభుత్వం, సైన్యం భీష్మించుకున్నాయి. ఈ క్రమంలోనే భారీ దాడులకు పాల్పడ్డాయి.

# సామాన్యుడిలా మంత్రి ముచ్చట



## మెట్రోలో జూపల్లి ప్రయాణం

**హైదరాబాద్, మహా:** నిత్యం సైరన్ల మోత, సెక్యూరిటీ వాహనాల కాన్వాయ్ మధ్య తిరిగే హోదా ఆయనది. కానీ, ఆ హంగూ ఆర్భాటాలను పక్కనపెట్టి, తోటి ప్రయాణికులతో కలిసి సామాన్యుడిలా మెట్రో రైలెక్కారు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు. బుధవారం నగరంలోని ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యే క్రమంలో ట్రాఫిక్ చిక్కులను తప్పించుకుని గమ్యస్థానానికి త్వరగా చేరుకోవాలని భావించిన ఆయన, మెట్రో మార్గాన్ని ఎంచుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎర్రమంజిల్ స్టేషన్‌కు చేరుకున్న మంత్రి, ప్రోటోకాల్ హడావుడి లేకుండా స్వయంగా టికెట్ కౌంటర్ వద్దకు వెళ్లి టికెట్ కొనుగోలు చేశారు. అనంతరం ప్లాట్‌ఫామ్ మీద సాధారణ ప్రయాణికుడిలా నిలబడి రైలు రాగానే లోపలికి వెళ్లారు. సమయం రద్దీగా ఉండటంతో రైలులో సీట్లు ఖాళీ లేవు. అయినప్పటికీ మంత్రి తన హోదాను ప్రదర్శించకుండా, తోటి ప్రయాణికులతో కలిసి నిలబడే మియాపూర్ వరకు ప్రయాణించారు. ప్రయాణ సమయంలో తన పక్కన ఉన్న వారితో ఆత్మీయంగా ముచ్చటించి, మెట్రో సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రిని అంత దగ్గరగా చూసిన ప్రయాణికులు తొలుత ఆశ్చర్యానికి లోనైనా, ఆయన పలకరింపుతో ఉత్సాహంగా మాట్లాడారు. ఈ క్రమంలో యువకులు, వృద్ధులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడగా, జూపల్లి ఎంతో ఓపికగా అందరితో ఫొటోలు దిగుతూ ప్రయాణాన్ని సాగించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, సమయాన్ని ఆదా చేస్తూ గమ్యస్థానాలకు చేరడానికి మెట్రో ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయమని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వర్షాల సమయంలోనూ, నగరంలోని ప్రధాన కూడళ్లలో రద్దీ పెరిగినప్పుడు మెట్రో సేవలు సామాన్యులకు ఎంతో ఊరటనిస్తాయని కొనియాడారు. మంత్రి ఇలా సాదాసీదాగా మెట్రోలో కనిపించడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఆయన ఎల్బీ నగర్ నుంచి కేపీహెచ్‌బీ వరకు ఇలాగే ప్రయాణించి వార్తల్లో నిలిచారు.



# ఆదిలాబాద్‌లో అతిపెద్ద విమానాశ్రయం నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

రామ్మోహన్ నాయుడు వివరించారు. ఇక్కడ రక్షణశాఖకు చెందిన 360 ఎకరాల భూమి ఉందని, రాష్ట్రప్రభుత్వం 450 ఎకరాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సంయుక్తంగా మీడియా సమావేశాన్ని నిర్వహించి, రాష్ట్రంలోని పలు పెండింగ్ విమానాశ్రయాల పురోగతిని వివరించారు.

**ప్రత్యేక నమూనాలో..**

ఆదిలాబాద్ ప్రాజెక్టు ఒక ప్రత్యేక నమూనాలో సాగనుంది. ఇది వ్యూహాత్మక ప్రాంతం కావడంతో పాటు వాయుసేన శిక్షణకు అనువైన ప్రదేశం కావడంతో, విమానాశ్రయ నిర్మాణ బాధ్యతను రక్షణ శాఖే చేపట్టనుంది. అదే ప్రాంగణంలో సామాన్య ప్రయాణికుల కోసం ప్రత్యేక టెర్మినల్‌ను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మిస్తుంది. దేశవ్యాప్తంగా రక్షణ మరియు పౌర అవసరాల కోసం ఉమ్మడిగా వాడుకుంటున్న 36 విమానాశ్రయాల జాబితాలో ఆదిలాబాద్ కూడా చేరనుంది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఆదిలాబాద్ ఒక వాణిజ్య హబ్‌గా మారి, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర మంత్రులు ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు పెద్దపల్లి జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి కూడా ముందడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలాన్ని కేంద్ర బృందం పరిశీలించిందని, ప్రాథమికంగా అది ఫీజిబిలిటీ రిపోర్టులో అనుకూలంగా వచ్చిందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా లిఖితపూర్వక సమాధానం అందగానే తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సాధారణంగా విమానాశ్రయానికి 600 నుంచి 700 ఎకరాలు అవసరమని, అయితే భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెద్ద విమానాలు దిగాలంటే 1200 ఎకరాల వరకు భూమి సేకరించాలని సూచించారు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చూపించిన స్థలం సాంకేతికంగా అనుకూలం కాదని ఆ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేశామని వివరించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటు ద్వారా పర్యాటకం, వ్యాపారం మెరుగుపడుతాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా ఈ సమావేశంలో పాల్గొని, భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థానిక ప్రజల మద్దతు కూడగడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో సహకరిస్తే, అతి త్వరలోనే తెలంగాణలోని మారుమూల ప్రాంతాల నుంచి కూడా విమానాలు గాల్లోకి ఎగురుతాయని కేంద్ర మంత్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇరాన్‌కు ఆయుధాలిస్తే 50 శాతం సుంకం..

- డొనాల్డ్ ట్రంప్ సంచలన హెచ్చరిక!
- మరో ఆర్థిక యుద్ధానికి తెరలేపిన అమెరికా.. ఎవరికీ మినహాయింపులు లేవని స్పష్టీకరణ
- పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం.. గంటల్లోనే ట్రంప్ 'టారిఫ్' బాంబు
- హార్ముజ్ జలసంధి పునరుద్ధరణే లక్ష్యం.. ప్రపంచ దేశాల్లో టెన్షన్

**హైదరాబాద్, మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో ప్రపంచ దేశాలను వణికించే ఆర్థిక నిర్ణయాన్ని ప్రకటించారు. ఇరాన్‌తో రెండు వారాల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న కొద్ది గంటల్లోనే, ఆయన ఒక శక్తివంతమైన హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్‌కు సైనిక ఆయుధాలను లేదా యుద్ధ సామగ్రిని సరఫరా చేసే ఏ దేశానికైనా అమెరికా గట్టి గుణపాఠం చెబుతుందని, ఆయా దేశాల నుండి అమెరికాకు ఎగుమతి అయ్యే అన్ని రకాల వస్తువులపై తక్షణమే 50 శాతం అదనపు సుంకాన్ని విధిస్తామని ఆయన ప్రకటించారు. తన 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ సంచలన నిర్ణయాన్ని వెల్లడించిన ట్రంప్, ఈ విషయంలో ఎవరికీ ఎటువంటి రాయితీలు లేదా మినహాయింపులు ఉండబోవని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొనడం ద్వారా అంతర్జాతీయ వాణిజ్య రంగంలో ఆయన ఒక కొత్త యుద్ధానికి తెరలేపారు. పశ్చిమ ఆసియాలో గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చేసిన మధ్యవర్తిత్వం ఫలించింది. ఇరాన్ మరియు అమెరికా మధ్య 15 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేసేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్ అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన 'హార్ముజ్ జలసంధి'ని తిరిగి తెరిచేందుకు సమ్మతించింది. అయితే, ఈ శాంతి చర్చలు కొనసాగుతున్న తరుణంలోనే ట్రంప్ ఈ 'టారిఫ్' అస్త్రాన్ని ప్రయోగించడం గమనార్హం. ఇరాన్ తన సైనిక బలాన్ని పెంచుకోకుండా పూర్తిగా ఒంటరిని చేయడమే లక్ష్యంగా ఆయన ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఒకవైపు ఇరాన్‌తో శాంతి చర్చలకు సిద్ధమంటూనే, మరోవైపు ఆ దేశానికి సహకరించే దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తామని హెచ్చరించడం ట్రంప్ మార్క్ దౌత్యానికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ 50 శాతం సుంకం విధింపు నిర్ణయం చైనా వంటి దేశాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇరాన్‌కు డ్రోన్లు మరియు ఇతర సైనిక విడిభాగాలను సరఫరా చేస్తున్న దేశాల జాబితాను అమెరికా నిశితంగా పరిశీలిస్తోంది. అమెరికా వంటి అతిపెద్ద మార్కెట్‌కు తమ వస్తువులను ఎగుమతి చేసే దేశాలు, ఇప్పుడు ఇరాన్‌కు సహకరిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ట్రంప్ ప్రకటించిన ఈ కఠినమైన విధానం వల్ల ప్రపంచ సరఫరా గొలుసు దెబ్బతినే ప్రమాదం ఉన్నప్పటికీ, అమెరికా ప్రయోజనాలే తమకు ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌లో 'ప్రోత్సాహకరమైన మార్పులు' వస్తున్నాయని వ్యాఖ్యానించిన ట్రంప్, ఆ దేశ అణు కార్యక్రమాలపై కూడా అమెరికా గట్టి నిఘా ఉంచుతుందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఒక గొప్ప విజయంగా అభివర్ణించినప్పటికీ, ట్రంప్ హెచ్చరికతో అంతర్జాతీయ సమాజం ఇప్పుడు డైలమాలో పడింది. ఒకవేళ ఏ దేశమైనా ఇరాన్‌కు రహస్యంగా ఆయుధాలు సరఫరా చేస్తే, ఆ దేశ ఆర్థిక వ్యవస్థను అమెరికా టారిఫ్‌లతో కుప్పకూల్చే ప్రమాదం ఉంది. ఈ తాత్కాలిక కాల్పుల విరమణ రెండు వారాల తర్వాత శాశ్వత శాంతి ఒప్పందానికి దారితీస్తుందా లేదా అనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. అయితే, మధ్య ప్రాచ్యంలో ఒక 'స్వర్ణ యుగం' రాబోతోందని, పునర్నిర్మాణ కార్యక్రమాల్లో అమెరికా చురుగ్గా పాల్గొంటుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ టారిఫ్ పెంపు నిర్ణయం ప్రపంచ స్టాక్ మార్కెట్లు, వాణిజ్య వర్గాల్లో పెను సంచలనంగా మారింది.

# సామాన్యుడికి ఊరట

## మారని రేపోరేటు.. వడ్డీ రేట్లు యథాతథం

## వరుసగా రెండోసారి మార్పులు చేయని రిజర్వ్ బ్యాంక్

**ముంబై, మహా :** రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి సామాన్యుడికి ఊరట కల్పించింది. కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన బుధవారం జరిగిన భారతీయ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యోల్బణ విధాన కమిటీ (ఎంపీసీ) రెపో రేటును 5.25 శాతంగా యథాతథంగా ఉంచింది. ప్రపంచ అనిశ్చితి, మారుతున్న ద్రవ్యోల్బణ పరిస్థితుల మధ్య ఈ నిర్ణయాన్ని కమిటీ ఏకగ్రీవంగా తీసుకున్నట్లు వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థపై తటస్థ వైఖరిని కొనసాగించాలని, స్థిరమైన దేశీయ వృద్ధిని బ్యాలెన్స్ చేయడంలో ఎంపీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 2025 నుండి ఆర్బీఐ ఇప్పటివరకు రేట్లలో మొత్తం 125 బేసిస్ పాయింట్ల కోత విధించింది. 2019 తర్వాత మొదటిసారిగా ఆర్బీఐ ఇంత వేగంగా రేట్లను తగ్గించింది. గతంలో జరిగిన కోతలను అంచనా వేయడానికి ఫిబ్రవరి 2026లో జరిగిన గత సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ రేట్లను స్థిరంగా ఉంచింది. డిసెంబర్ 2025లో రెపో రేటులో 25 బేసిస్ పాయింట్ల కోత విధించడం తెలిసిందే.

**ప్రధాన రేట్లు యథాతథం**

తాజా నిర్ణయంతో స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటు 5 శాతంగా ఉంది. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్), బ్యాంక్ రేటు 5.5 శాతం వద్ద కొనసాగుతున్నాయి. మారుతున్న ఆర్థిక వాతావరణానికి తగ్గట్లుగా వెసులుబాటును సూచిస్తూ ఎంపీసీ తటస్థ విధాన వైఖరిని పాటించింది.

**ఫిబ్రవరి బ్రేక్ తర్వాత కొనసాగింపు**

ఆర్థిక సంవత్సరం 202526 లో మొత్తం 125 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటు కోతల తర్వాత, ఫిబ్రవరి 2026 పాలసీ సమీక్షలో కూడా ఆర్బీఐ వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచింది. ఆ నిర్ణయాన్నే ఏప్రిల్ మీటింగ్‌లో ఫాలో అయింది.

# ఖర్చుగా కాదు... భాగస్వామ్యంగా చూడండి...

## ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి.. అవసరమైన సహకారం మేం అందిస్తాం

## కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆ




ర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, నాడం ఫౌండేషన్ నుంచి పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# టెక్ ప్రపంచంలో ఆగని లేఆఫ్స్ సెగ..

## అమెజాన్‌లో మరో 14 వేల మందిపై వేటుకు రంగం సిద్ధం!

- ఒరాకిల్‌లో 30 వేల మంది తొలగింపు ప్రకంపనలు మరువక ముందే మరో షాక్
- వచ్చే నెలలో ఉద్యోగ కోతలు.. ఏ డబ్ల్యు ఎస్, రిటైల్, హెచ్‌ఆర్ విభాగాల్లో తీవ్ర ప్రభావం
- వరుస తొలగింపులతో ఐటీ ఉద్యోగుల్లో గ్లోబల్ భయం.. బతుకులు రోడ్డున పడతాయని ఆవేదన





**హైదరాబాద్, మహా:** ప్రపంచ ఐటీ రంగంలో ఉద్యోగాల కోత పర్వం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రముఖ ఐటీ దిగ్గజం ఒరాకిల్ ఇటీవలే ప్రపంచవ్యాప్తంగా 30 వేల మంది ఉద్యోగులను తొలగించి సృష్టించిన ప్రకంపనలు మరువక ముందే, ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ కూడా అదే బాట పట్టడం ఆందోళన కలిగిస్తోంది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా అమెజాన్ తాజాగా ఏకంగా 14 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. 'ఆసియా బిజినెస్ అవుట్‌లుక్' నివేదిక ప్రకారం వచ్చే నెల (మే 2026) లోనే ఈ లేఆఫ్స్ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఈ వార్తలతో ఐటీ రంగంలో మరోసారి నిరుద్యోగ భయం నెలకొంది. అమెజాన్ తన కీలక విభాగాలైన అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటైల్ మరియు హ్యూమన్ రిసోర్సెస్ విభాగాల్లో ఈ కోతలు ఉండబోతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే, ఈ భారీ తొలగింపులపై అమెజాన్ యాజమాన్యం నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. వాస్తవానికి అమెజాన్ గత రెండు సంవత్సరాలుగా నిరంతరం ఉద్యోగులను తొలగిస్తూనే ఉంది. 2025 ఏడాదిలో 14 వేల మందిని, ఈ 2026 ప్రారంభం లోనే మరో 16 వేల మందిని ఆ సంస్థ ఇప్పటికే ఇంటికి పంపింది. ఇప్పుడు మళ్ళీ కేవలం నెల రోజుల వ్యవధిలోనే మరో 14 వేల మందిపై వేటు వేయాలని భావిస్తుండటం ఉద్యోగులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి కారణం చూపుతూ మైక్రోసాఫ్ట్, టీసీఎల్, యాక్సెంచర్, ఒరాకిల్ వంటి టెక్ దిగ్గజాలు వరుసగా వేల సంఖ్యలో ఉద్యోగ కోతలు విధిస్తున్నాయి. ఒకప్పుడు ఎంతో సురక్షితమని భావించిన ఐటీ కొలువులు ఇప్పుడు పేకమేడల్లా కూలిపోతుండటంతో ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. తాము ఎంతో కష్టపడి నిర్మించుకున్న కెరీర్ ఒక్క రాత్రిలోనే ముగిసిపోతుండటం, తమ బతుకులు ఎప్పుడు రోడ్డున పడతాయోననే భయం ప్రతి ఒక్కరిని వెంటాడుతోంది. ఐటీ కంపెనీల ఈ వరుస లేఆఫ్స్ నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ నిపుణుల్లో తీవ్ర అశాంతిని రేకెత్తిస్తున్నాయి.

# కోమాలో ఉన్న భర్త.. తల్లి కావాలనుకుంటున్న భార్య

## ఢిల్లీ హైకోర్టులో అరుదైన న్యాయపోరాటం

- వీర్య సేకరణకు అనుమతించాలని విన్నపం.. నిబంధనల అడ్డంకితో వీడని ఉత్కంఠ
- రేపు వెలువడనున్న కీలక నిర్ణయం.. దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్న కేసు



**ఢిల్లీ, మహా:** మృత్యువుతో పోరాడుతున్న భర్త జ్ఞాపకాన్ని సంతానం రూపంలో పదిలం చేసుకోవాలనుకుంటున్న ఒక భార్య ఆవేదన, దీనికి అడ్డుపడుతున్న చట్టపరమైన నిబంధనల మధ్య సాగుతున్న ఒక అరుదైన కేసు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ హైకోర్టు వేదికగా సాగుతున్న ఈ వినూత్న న్యాయ పోరాటం నైతిక, చట్టపరమైన విలువలపై కొత్త చర్చకు తెరలేపింది. గత ఏడాది మార్చి నెల నుంచి కోమాలో ఉండి, ఐసీయూలో వెంటిలేటర్ సహాయంతో ప్రాణాలను నిలుపుకుంటున్న ఓ వ్యక్తికి సంబంధించిన ఈ ఉదంతం మానవ సంబంధాలలోని సున్నితత్వాన్ని ఆవిష్కరిస్తోంది. సదరు వ్యక్తి కోలుకునే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని వైద్యులు తేల్చి చెప్పిన నేపథ్యంలో, అతని ద్వారా తాను తల్లిని కావాలని, ఇందుకోసం భర్త వీర్యాన్ని సేకరించి భద్రపరిచేందుకు అనుమతించాలని ఆ మహిళ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. సాధారణంగా సంతానోత్పత్తి చికిత్సలు చేపట్టాలంటే భార్యాభర్తలిద్దరి పరస్పర లిఖితపూర్వక అంగీకారం తప్పనిసరి అని నిబంధనలు చెబుతున్నాయి. అయితే ఇక్కడ భర్త అపస్మారక స్థితిలో ఉండటం వల్ల ఆయన అంగీకారం తెలిపే పరిస్థితి లేదు. ఈ క్లిష్ట సమయంలో కాలం గడిచేకొద్దీ వీర్యం నాణ్యత దెబ్బతింటుందని, తద్వారా ఆ మహిళ తల్లి కావాలనే ఆశలు శాశ్వతంగా అడుగంటుతాయని ఆమె తరపు న్యాయవాది అరిజిత్ గౌర్ కోర్టుకు విన్నవించారు. భర్త ప్రాణాలతో ఉన్నప్పుడే, వీర్యం సజీవంగా ఉన్న తరుణంలో దానిని సేకరించడం అత్యంత ఆవశ్యకమని ఆయన వాదించారు. వైద్య శాస్త్రంలో దీనిని 'సర్జికల్ స్పెర్మ్ రిట్రీవల్' అని పిలుస్తారని, సన్నని సూది ద్వారా వృషణాల నుండి దీనిని వెలికితీస్తారని ఈ సందర్భంగా నిపుణులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సున్నితమైన అభ్యర్థనను పరిష్కరించే క్రమంలో, భర్త ప్రస్తుత వైద్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియ చేపట్టడం ఎంతవరకు సాధ్యం మరియు సురక్షితం అనే అంశాన్ని నిర్ధారించడానికి ఒక నిపుణుల వైద్య మండలిని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోర్టును కోరారు. కేంద్ర ప్రభుత్వ తరపు న్యాయవాది ఆయుష్ గౌర్ ఈ కేసులోని చట్టపరమైన చిక్కులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ కేసుపై ఏప్రిల్ 9వ తేదీన అంటే రేపు ఢిల్లీ హైకోర్టులో తుది విచారణ జరగనుంది. ఒకవేళ కోర్టు సానుకూల నిర్ణయం తీసుకుంటే, భవిష్యత్తులో ఇటువంటి అసాధారణ పరిస్థితులలో ఉన్న బాధితులకు ఈ తీర్పు ఒక మార్గదర్శకంగా నిలవనుంది. చట్టం మరియు మాతృత్వపు ఆశల మధ్య సాగుతున్న ఈ పోరాటంలో న్యాయస్థానం ఏ విధమైన తీర్పునిస్తుందోనని యావత్ దేశం ఉత్కంఠతో ఎదురుచూస్తోంది.

# 40 ఏళ్ల నిరీక్షణకు దక్కిన ప్రతిఫలం..

- తబలా మాస్టర్‌ను వరించిన కోటిన్నర లాటరీ!
- రూ. 200 టికెట్‌తో కోటీశ్వరుడైన గుర్‌చరణ్ సింగ్
- పగలు పెయింటర్.. రాత్రి కళాకారుడు.. ఇప్పుడు లక్ష్మీపుత్రుడు
- కుమారుడి పేరుతో కొనుగోలు చేసిన టికెట్‌కు వరించిన బంపర్ బహుమతి




**లుధియానా,మహా:**అదృష్టం ఎప్పుడు ఎవరిని ఏ రూపంలో వరిస్తుందో చెప్పలేమనడానికి పంజాబ్‌కు చెందిన గుర్‌చరణ్ సింగ్ జీవితమే ఒక నిదర్శనం. 'రావలసిన కాలం వస్తే.. అదృష్టం తలుపు తడుతుంది' అన్నట్లుగా, దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఆ అదృష్టం ఈ తబలా కళాకారుడిని కోటీశ్వరుడిని చేసింది. నవాన్ శహర్‌కు చెందిన గుర్‌చరణ్ సింగ్ నెలవారీ బంపర్ లాటరీలో ఏకంగా రూ.1.5 కోట్ల భారీ బహుమతిని గెలుచుకున్నారు. కేవలం 200 రూపాయల టికెట్‌తో ఆయన కుటుంబ దశ తిరగడం ఇప్పుడు స్థానికంగా పెద్ద చర్చనీయాంశమైంది. ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి ఒక్కసారిగా కోటీశ్వరుడిగా మారడంతో ఆ ఇంట ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి.గుర్‌చరణ్ సింగ్ జీవితం ఎంతో శ్రమతో కూడుకున్నది. ఆయన రాత్రివేళల్లో జాతరలు, వివిధ శుభకార్యాల్లో తబలా వాయిస్తూ జీవనం సాగించేవారు. కేవలం కళ మీద వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో, పగటిపూట పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఇలా రెండు పడవల ప్రయాణం చేస్తూనే, గత 40 ఏళ్లుగా క్రమం తప్పకుండా లాటరీ టికెట్లు కొనుగోలు చేయడం ఆయనకు అలవాటు. ఎన్నిసార్లు నిరాశ ఎదురైనా, ఏదో ఒకరోజు అదృష్టం వరిస్తుందనే నమ్మకంతో ఈసారి కూడా తన కుమారుడి పేరు మీద ఒక టికెట్‌ను కొనుగోలు చేశారు. ఏప్రిల్ 4న జరిగిన డ్రాలో ఆయన కొన్న 51565556 నంబరు గల టికెట్‌కే బంపర్ ప్రైజ్ దక్కింది.ఈ విజయం గురించి గుర్‌చరణ్ సింగ్ మాట్లాడుతూ, తొలుత తనకు వచ్చిన ఫోన్ కాల్‌ను నమ్మలేకపోయానని చెప్పారు. తాను ఇంట్లో భోజనం చేస్తున్న సమయంలో లాటరీ గెలిచినట్లు ఫోన్ రాగా, అది ఏదో ఫ్రాడ్ కాల్ అని భావించి పట్టించుకోలేదన్నారు. అయితే లాటరీ నిర్వాహకులు పలుమార్లు ఫోన్ చేసి నమ్మకం కలిగించడంతో తన ఆనందానికి అవధులు లేవని, ఒక సామాన్యుడిని కోటీశ్వరుడిని చేసిన భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. తనకు వచ్చిన ఈ భారీ మొత్తాన్ని తన పిల్లలు, మనవళ్ల భవిష్యత్తు కోసం, ముఖ్యంగా వారి ఉన్నత చదువుల కోసం వినియోగిస్తానని ఆయన స్పష్టం చేశారు.గుర్‌చరణ్ కుమార్తె పరమ్‌జీత్ కౌర్ కూడా తమ తండ్రి సాధించిన ఈ విజయంపై స్పందిస్తూ, తమ కుటుంబం ఎంతో పేదరికం నుంచి వచ్చిందని, ఈ డబ్బు తమ జీవితాల్లో పెద్ద వెలుగు నింపిందని సంతోషం వ్యక్తం చేశారు. లాటరీ విక్రేత శామ్ భనోట్ మాట్లాడుతూ, గత 40 ఏళ్లుగా శ్రమిస్తున్న గుర్‌చరణ్ వంటి వ్యక్తికి ఈ బహుమతి రావడం ఎంతో సంతృప్తి నిచ్చిందని పేర్కొన్నారు. భనోట్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా 2026 ప్రారంభంలోనే ఐదుగురు కోటీశ్వరులుగా మారడం విశేషమని ఆయన వెల్లడించారు. సహనం, పట్టుదల ఉంటే అదృష్టం ఏదో ఒక రోజు కచ్చితంగా తలుపు తడుతుందని గుర్‌చరణ్ సింగ్ ఉదంతం మరోసారి నిరూపించింది.

# మీ ఇంటి నుండే డిజిటల్ జనగణన

- కాగితం వాడకం లేకుండానే జనాభా వివరాల నమోదు
- ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి
- కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్
- స్వయంగా తన ఇంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన కేంద్ర మంత్రి
- వికసిత భారత్ లక్ష్య సాధనకు డిజిటల్ జనగణన దిక్సూచి



**హైదరాబాద్, మహా:**దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన జనగణన ప్రక్రియలో పౌరులకు కేంద్ర ప్రభుత్వం ఒక అద్భుతమైన అవకాశాన్ని కల్పించిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. జనగణన అధికారుల ప్రమేయం లేకుండానే, ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో నుండే డిజిటల్ విధానంలో సొంతంగా వివరాలను నమోదు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో జాతీయ రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణాంకాల కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్, జాయింట్ డైరెక్టర్ దీరజ్ జైన్ మరియు ఇతర ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జనగణనలో భాగంగా తొలిదశలో చేపడుతున్న హౌజ్ లిస్టింగ్ (ఇంటి వివరాలు), హౌజింగ్ సెన్సెస్ (ఇంట్లోని సౌకర్యాలు) నమోదు ప్రక్రియపై అధికారులతో ఆయన సుదీర్ఘంగా చర్చించి, పౌరుల స్వీయ నమోదు ప్రాధాన్యతను వివరించారు.ఈ మహత్తర జాతీయ కార్యక్రమంలో పౌరులంతా ఉత్సాహంగా పాల్గొనాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. అధికారులు ఇంటికి వచ్చే వరకు వేచి చూడాల్సిన అవసరం లేకుండానే, https://se.census.gov.in అనే అధికారిక వెబ్ సైట్ సందర్శించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే మంత్రి స్వయంగా డిజిటల్ విధానంలో తన ఇల్లు మరియు అందులోని వసతులకు సంబంధించిన సమాచారాన్ని పోర్టల్‌లో నమోదు చేసి చూపారు. తొలిదశలో కేవలం లోకేషన్ వివరాలు, కుటుంబం నివసించే ఇల్లు, కార్యాలయం మరియు అక్కడ ఉన్న కనీస వసతుల సమాచారాన్ని మాత్రమే సేకరిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సరికొత్త విధానం ద్వారా సమాచార సేకరణలో ఖచ్చితత్వం ఉండటమే కాకుండా, పౌరుల గోప్యతకు కూడా భరోసా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం డిజిటల్ దిశగా అడుగులు వేయడం శుభపరిణామమని, ఇది వికసిత భారత్ లక్ష్య సాధనను మరింత వేగవంతం చేస్తుందని బండి సంజయ్ అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో కాగితాలతో పనిలేకుండా, పూర్తిస్థాయిలో డిజిటల్ సాధనాలను ఉపయోగించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ప్రజలు స్వీయ నమోదు పోర్టల్ ద్వారా తమ వివరాలను సమర్పించేందుకు ముందుకు రావడం సంతోషదాయకమని, ఇది ప్రజల్లో ఉన్న అవగాహనకు నిదర్శనమని ఆయన చెప్పారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ బృహత్తర ప్రక్రియలో ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా పాల్గొని, అధికారిక వెబ్ సైట్ ద్వారా తమ వివరాలను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# నటి రేణు దేశాయ్‌పై అసభ్య కామెంట్..

## యూట్యూబ్ 'వీరుడి'కి సంకెళ్లు

- గుంటూరులో నిందితుడిని అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ పోలీసులు
- సోషల్ మీడియాలో హద్దులు దాటితే కటకటాలే: డీసీపీ హెచ్చరిక

**గచ్చిబౌలి, మహా:**సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలపై, మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ వికృతానందం పొందే వారికి సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గట్టి హెచ్చరిక పంపారు. ప్రముఖ సినీ నటి రేణు దేశాయ్‌ను ఉద్దేశించి యూట్యూబ్‌లో అత్యంత అనుచితమైన, అభ్యంతరకరమైన కామెంట్ పోస్ట్ చేసిన ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన చెన్నయ్య రుంజలగా గుర్తించి, అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన చెన్నయ్య ఖాళీ సమయంలో యూట్యూబ్‌లో రీల్స్, వీడియోలు చూడటం అలవాటు చేసుకున్నాడు. ఈ క్రమంలోనే ఇటీవల నటి రేణు దేశాయ్‌కు సంబంధించిన ఒక వీడియోను వీక్షించిన నిందితుడు, తన యూట్యూబ్ ఖాతా ద్వారా ఆ వీడియో కింద అత్యంత అసభ్యకరమైన కామెంట్‌ను పోస్ట్ చేశాడు. ఈ విషయంపై సమాచారం అందుకున్న సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడు గుంటూరులో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లిన ప్రత్యేక బృందం అతడిని అదుపులోకి తీసుకుంది. నిందితుడిని అరెస్ట్ చేయడానికి గల కారణాలను వివరించి గచ్చిబౌలిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా నిందితుడు తన నేరాన్ని అంగీకరించడమే కాకుండా, కామెంట్ పోస్ట్ చేయడానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. సోషల్ మీడియా వినియోగదారులు ఇంటర్నెట్ వేదికలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఇతరుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా లేదా అసభ్యకరంగా కామెంట్లు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఎవరైనా హద్దులు దాటి అభ్యంతరకర పోస్టులు పెడితే కఠినమైన చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఆరోగ్యకరమైన చర్చల కోసం ఉపయోగించుకోవాలని, ఎక్కడైనా సైబర్ నేరాలు జరుగుతున్నట్లు గమనిస్తే తక్షణమే సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని లేదా సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ '1930'కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# ఎఫ్‌సిఐ బియ్యం కుంభకోణం

## మాజీ జిల్లా మేనేజర్ సహా 11 మందికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష

- అవినీతి కేసులో పంజాబ్ సీబీఐ కోర్టు సంచలన తీర్పు
- నాసిరకం బియ్యాన్ని 'ఏ' గ్రేడ్‌గా చూపి ప్రభుత్వానికి భారీ గండి
- రెండు దశాబ్దాల సుదీర్ఘ విచారణ తర్వాత దోషులకు శిక్ష ఖరారు

**హైదరాబాద్ మహా:** భారత ఆహార సంస్థ లో జరిగిన భారీ బియ్యం కుంభకోణానికి సంబంధించి పంజాబ్‌లోని ఎస్ఏఎస్ నగర్ (మొహాలీ) సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ అవినీతి కేసులో దోషులుగా తేలిన ఎఫ్.సి.ఐ మాజీ జిల్లా మేనేజర్‌తో సహా మొత్తం 11 మందికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. జైలు శిక్షతో పాటు దోషులందరికీ కలిపి మొత్తం 3.3 లక్షల రూపాయల జరిమానాను కూడా విధించింది. సుమారు 20 ఏళ్ల క్రితం వెలుగుచూసిన ఈ కుంభకోణంలో సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును ప్రకటించింది.ఈ కేసు వివరాల్లోకి వెళ్తే.. 200405 ఖరీఫ్ సీజన్ సమయంలో పంజాబ్ రీజియన్‌లోని ఫరీద్‌కోట్ జిల్లా మోగా డిపోలో భారీ అక్రమాలు జరిగినట్లు తేలింది. వివిధ రైస్ మిల్లర్ల నుండి సేకరించిన నాసిరకం బియ్యం నిల్వలను, ఎఫ్.సి.ఐ అధికారులు మిల్లర్లతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా 'A' గ్రేడ్ బియ్యంగా రికార్డుల్లో నమోదు చేశారు. నాణ్యత లేని బియ్యాన్ని మేలైన రకంగా చూపి ప్రభుత్వ నిధులను మిల్లర్లకు చెల్లించారు. అయితే, పంజాబ్ నుండి ఇతర రాష్ట్రాలకు పంపిన ఈ బియ్యం నిల్వలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నాసిరకంగా గుర్తించి తిరస్కరించడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. దీనివల్ల భారత ఆహార సంస్థకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది.దీనిపై రంగంలోకి దిగిన సీబీఐ.. 2006 జనవరి 7న ఎఫ్.సి.ఐ ఉన్నతాధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు మరియు రైస్ మిల్లర్లపై కేసు నమోదు చేసింది. లోతైన విచారణ అనంతరం 2008 నవంబర్ 28న సీబీఐ కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేసింది. తాజాగా కోర్టు శిక్ష విధించిన వారిలో అప్పటి ఎఫ్.సి.ఐ జిల్లా మేనేజర్ రాజేష్ రంజన్, డిప్యూటీ మేనేజర్ (క్యూసీ) ఆజాద్ సింగ్, అసిస్టెంట్ మేనేజర్లు (క్యూసీ) డి.కె. శర్మ, గియాన్ సింగ్‌లు ఉన్నారు. వీరితో పాటు టెక్నికల్ అసిస్టెంట్లుగా పనిచేసిన రాజ్‌కుమార్, ఆర్.సి. పూరి, గులాబ్ సింగ్, పీతాంబర్ సింగ్, జి.పి.ఎస్. కల్రాలను కోర్టు దోషులుగా నిర్ధారించింది. అధికారులకు సహకరించిన ప్రైవేట్ వ్యక్తులు, పంజాబ్ రైస్ అండ్ జనరల్ మిల్స్ భాగస్వామి గోవిందర్ సింగ్, ఆర్.పి. ఆగ్రో ఇండస్ట్రీస్ భాగస్వామి ప్రదీప్ బన్సల్‌లకు కూడా కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రభుత్వ విధుల్లో ఉండి అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠినంగా వ్యవహరించాలని, ఇటువంటి తీర్పులు అవినీతి నిరోధానికి బాటలు వేస్తాయని న్యాయస్థానం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. సుదీర్ఘకాలం పాటు సాగిన ఈ కేసులో ఎట్టకేలకు న్యాయం జరిగిందని, దోషులకు సరైన శిక్ష పడిందని సీబీఐ వర్గాలు పేర్కొన్నాయి.

# గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు అటవీ అడ్డంకులు తొలగాలి

- అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయండి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- మౌలిక వసతుల కల్పనే లక్ష్యం.. నిధులున్నా పనులు ఆగితే సహించం
- గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులకు దిశానిర్దేశం



**హైదరాబాద్ , మహా:** గిరిజన ప్రాంతాల సమస్యల పరిష్కారంలో అధికారులు కేవలం నిబంధనలకే పరిమితం కాకుండా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. గిరిజన జీవితాల్లో వెలుగులు నింపడమే ఈ ప్రజా ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన ఆదేశించారు. బుధవారం సచివాలయంలో గిరిజన ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన త్రోవ (రోడ్డు), గూడు (ఇల్లు), కరెంటు (విద్యుత్), తాగునీరు వంటి ప్రాథమిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇవే గిరిజనుల జీవన ప్రమాణాల పెరుగుదలకు పునాదులని మంత్రి పేర్కొన్నారు. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, అమలు దశలో పలు అడ్డంకులు ఎదురవుతుండటంపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, కేటాయించిన ప్రతి పైసా లక్షిత వర్గాలకు చేరేలా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నిధులు అందుబాటులో ఉన్నా పనులు జరగకపోవడాన్ని ప్రభుత్వం ఎంతమాత్రం సహించబోదని ఆయన హెచ్చరించారు. అటవీ భూములు, పోడు సాగు, ఫారెస్ట్ రైట్స్ చట్టం కింద హక్కుల పత్రాల జారీ వంటి సున్నితమైన అంశాల్లో అటవీ మరియు రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అడవినే నమ్ముకుని జీవించే గిరిజనులకు వ్యవసాయమే జీవనాధారమని, అటవీ చట్టాలకు లోబడి వారికి ఎక్కడ వీలైతే అక్కడ సాగు భూమిని అందుబాటులోకి తెచ్చేలా అటవీ శాఖ అధికారులు చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే వివాదాస్పద భూముల పరిష్కారానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.గిరిజన యువతకు శాపంగా మారిన కుల ధ్రువీకరణ పత్రాల జారీ సమస్యపై మంత్రి ప్రత్యేకంగా స్పందించారు. ఈ విషయంలో నెలకొన్న న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు హైకోర్టు అడ్వకేట్ జనరల్‌తో సంప్రదింపులు జరిపి, ఎస్టీ సర్టిఫికెట్ల వ్యవహారంలో శాశ్వత పరిష్కారం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గిరిజన విద్యార్థులు, యువతకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధ్రువీకరణ ప్రక్రియను సరళీకృతం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో గిరిజన ప్రాంతాల్లో ఎదురవుతున్న ఇసుక రవాణా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, గిరిజనులకు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ప్రత్యేక అనుమతులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా కొత్త బోర్లు వేయడంతో పాటు, పాత నీటి వనరులను పునరుద్ధరించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా 'మానిటరింగ్ సెల్' ఏర్పాటు చేయాలని మంత్రి నిర్ణయించారు. తానే స్వయంగా గిరిజన గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటానని వెల్లడించారు. ఈ నెలాఖరులోగా గిరిజన ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలపై పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, అమలు ప్రారంభించాలని అధికారులకు గడువు విధించారు. ఒకే నిబంధనను రాష్ట్రమంతటా వర్తింపజేయకుండా, స్థానిక భౌగోళిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.ఈ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ హామీ ఇచ్చారు. గిరిజన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించినందుకు ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ మంత్రిని అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యసాచి ఘోష్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ, ఎమ్మెల్యేలు బాలు నాయక్, రామచంద్ర నాయక్, డా. చిక్కుడు వంశీకృష్ణ, మురళి నాయక్, కోవ లక్ష్మి, అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# తీర ప్రాంత మత్స్యకారుల రక్షణకు చర్యలు చేపట్టండి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీజేపీ నేత పీవీఎన్ మాధవ్ వినతి
- హోంగార్డుల బదిలీ సమస్యను పరిష్కరించాలని కోరిక

**అమరావతి, మహా:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నేత పీవీఎన్ మాధవ్ బుధవారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మత్స్యకారులు ఎదుర్కొంటున్న వేధింపులతో పాటు, హోంగార్డుల చిరకాల వాంఛ అయిన అంతర్రాష్ట్ర బదిలీల అంశంపై ఆయన ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. రాష్ట్రంలోని నెల్లూరు, ఒంగోలు, బాపట్ల తీర ప్రాంతాల్లో పొరుగు రాష్ట్రమైన తమిళనాడుకు చెందిన మత్స్యకారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశిస్తూ స్థానిక మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని మాధవ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమిళనాడు మత్స్యకారులు స్పీడ్ బోట్లతో వచ్చి మన జలాల్లోని మత్స్య సంపదను యథేచ్ఛగా దోచుకుపోవడమే కాకుండా, స్థానికుల వలలను, పడవలను ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రశ్నించిన స్థానిక మత్స్యకారులపై దాడులకు కూడా తెగబడుతున్నారని, దీనివల్ల తీర ప్రాంత గ్రామాల్లో అశాంతి నెలకొంటోందని వివరించారు. ఈ పరిణామాలు శాంతిభద్రతలకు సవాల్‌గా మారుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి మెరైన్ పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కోరారు.ముఖ్యంగా ఇటీవల నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె తీరంలో అక్రమంగా వేటాడుతున్న కొన్ని బోట్లను స్థానిక మత్స్యకారులు సాహసించి పట్టుకున్నారని, అయితే సంబంధిత అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకోకుండానే ఆ బోట్లను విడుదల చేయడంపై మాధవ్ విస్మయం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు అక్రమార్కులకు కొమ్ముకాయడమేనని, ఇప్పటికైనా తీరప్రాంత భద్రతను బలోపేతం చేసి, మన మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న హోంగార్డుల సమస్యను కూడా పీవీఎన్ మాధవ్ ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర విభజన అనంతరం సుమారు 400 మంది హోంగార్డులు తమ స్వగ్రామాలకు దూరంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల మధ్య హోంగార్డుల పరస్పర బదిలీల ప్రక్రియను చేపట్టి, వారిని స్వస్థలాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మానవతా దృక్పథంతో ఈ అంశాన్ని పరిశీలించి, హోంగార్డుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి విన్నవించారు. పీవీఎన్ మాధవ్ విన్నపాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.



# పంజాగుట్టలో 'లవ్ జిహాద్' కలకలం

- పాత నేరస్తుడిపై మరో కేసు నమోదు
- ప్రేమ పేరుతో యువతికి వల.. వేధింపులకు గురిచేసిన నిందితుడు
- గతంలోనే నిందితుడిపై పోక్సో, రేప్ కేసులు
- ఐదుగురు అన్నదమ్ములు కలిసి లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు*



**హైదరాబాద్ , మహా:** నగరంలోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక సంచలన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో వలవేసి, ఓ యువతిని మభ్యపెట్టిన ఘటన 'లవ్ జిహాద్' ఆరోపణలకు దారితీసింది. పోలీసులు మరియు బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. జమీర్ (38) అనే వ్యక్తి, మధురెడ్డి (21) అనే హిందూ యువతిని ప్రేమ పేరుతో ట్రాప్ చేశాడు. అయితే, నిందితుడి అసలు స్వరూపం బయటపడటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

**నేర చరిత్ర కలిగిన నిందితుడు**

పోలీసు రికార్డుల ప్రకారం నిందితుడు జమీర్ ఒక పాత నేరస్తుడు. సుమారు ఆరు నెలల క్రితం ఒక తొమ్మిదేళ్ల హిందూ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో అతనిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లోనే *పోక్సో * చట్టం కింద కేసు నమోదైంది. దీనితో పాటు అతనిపై గతంలో పలు రేప్ కేసులు కూడా ఉన్నట్లు సమాచారం. ఇంతటి నేర చరిత్ర ఉన్నప్పటికీ, మళ్లీ మరో యువతిని టార్గెట్ చేసి వేధింపులకు గురిచేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

**అన్నదమ్ములు కలిసి దారుణం**

బాధితురాలు వెల్లడించిన మరిన్ని దిగ్భ్రాంతికర విషయాల ప్రకారం.. నిందితుడు జమీర్ తమ్ముడు మీరాజ్ కూడా రెండు నెలల క్రితం మరో హిందూ యువతిని ప్రేమ పేరుతో ట్రాప్ చేసినట్లు తెలుస్తోంది. కేవలం ఒకరిద్దరే కాకుండా, మొత్తం ఐదుగురు అన్నదమ్ములు కలిసి ఒక పథకం ప్రకారం యువతులను ప్రేమ పేరుతో మోసం చేస్తూ, వారిని లైంగికంగా వాడుకుంటున్నారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ముఠా వ్యవస్థీకృత పద్ధతిలో యువతులను లక్ష్యంగా చేసుకుని అరాచకాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం బాధితురాలి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. నేర చరిత్ర ఉన్న నిందితుడిపై మరియు అతనికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# అబద్ధాల రావు, డ్రామారావు.. ఖబడ్దార్!

**హైదరాబాద్, మహా:**పదేళ్ల పాటు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని కొల్లగొట్టి, ఒంటినిండా అవినీతి బురద పూసుకున్న బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు ఆ బురదను ప్రజా ప్రభుత్వానికి అంటించాలని చూస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన బీఆర్ఎస్ అగ్రనేతలపై నిప్పులు చెరిగారు. తనపై వస్తున్న ఆరోపణల్లో ఒక్కటి నిరూపించినా ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. "అబద్ధాల రావు (హరీశ్ రావు), డ్రామారావు (కేటీఆర్), శకుని మామ (కేసీఆర్).. మీ అసత్యాల పర్వం ఆపకుంటే ఖబడ్దార్" అంటూ హెచ్చరించారు.

**నాదర్గుల్ భూములు: పాపం బీఆర్ఎస్‌ది.. నింద మాదా?**

నాదర్గుల్ భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి డాక్యుమెంట్లను, గూగుల్ మ్యాప్ ఆధారాలను మీడియా ముందుంచారు. బాలాపూర్ మండలం నాదర్గుల్ లోని 373 ఎకరాల 13 గుంటల భూమి ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ అయ్యింది బీఆర్ఎస్ హయాంలోనే అని ఆయన స్పష్టం చేశారు. 2014 సెప్టెంబర్ 1న మూడు ప్రైవేట్ సంస్థలకు రిజిస్ట్రేషన్ చేసిన ప్రభుత్వం ఎవరిది అని ఆయన ప్రశ్నించారు. 2016లో మ్యుటేషన్ చేసింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పటి ఫైల్ నంబర్లతో సహా ఆధారాలు బయటపెట్టారు. 2021 నుండి 2022 చివరి వరకు ఆ భూమి చుట్టూ రేకులు పెట్టించి, రోడ్లు వేయించింది దొరల పాలనలో కాదా అని నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇది ప్రభుత్వ భూమి అని, నాలా కన్వర్షన్ చేయలేమని కోర్టులో గట్టిగా కొట్లాడుతున్నామని, 2026 మార్చిలో ప్రభుత్వం తరపున బలమైన కౌంటర్ దాఖలు చేశామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన దోపిడీని ప్రస్తుత ప్రభుత్వానికి అంటగట్టడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.

**వట్టినాగులపల్లి 'కుటుంబ పంచాయితీ'కి ప్రభుత్వంతో ఏం సంబంధం?**

వట్టినాగులపల్లి భూములపై వస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధాలని పొంగులేటి కొట్టిపారేశారు. అది షా కుటుంబానికి సంబంధించిన 6070 ఏళ్ల నాటి ఆస్తితగాదా అని, ఆ కుటుంబ పంచాయితీని ప్రభుత్వానికి అంటగట్టడం హాస్యాస్పదమని అన్నారు. ఎన్నికలకు కేవలం 15 రోజుల ముందు, 2023 ఆగస్టులో సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో శకుని మామకు ఇష్టమైన 'ఆ హోమ్ ఈ హోమ్' (మై హోమ్) సంస్థ కోసం నాలా కన్వర్షన్ చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. ఓఆర్ఆర్ కోసం భూమి సేకరించినప్పుడు తగ్గిన విస్తీర్ణం విషయంలో వచ్చిన గొడవను తన కుమారుడికి ముడిపెట్టడం దుర్మార్గమన్నారు. తన కుమారుడు కేవలం ఒక డెవలప్‌మెంట్ కంపెనీలో భాగస్వామి మాత్రమేనని, ఆ భూమిని కొనుగోలు చేయలేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో కోర్టు ఏ తీర్పు ఇచ్చినా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం మై హోమ్ ప్రయోజనాల కోసం అమాయకులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

# ఓర్పుతో నేర్పుగా ఎదిగిన రియల్ మహర్షి

## సాధారణ స్థాయి నుండి అసాధారణ విజయాలు.. ఐడియల్ సురేష్ సక్సెస్ స్టోరీ

(మహా ప్రత్యేకం)

నిశ్శబ్దం నుంచి గర్జన పుడుతుంది.. సాధారణత్వం నుంచే అసాధారణ విజయాలు ఉద్భవిస్తాయి. పశ్చిమ గోదావరి జిల్లాలోని పచ్చని పొలాల మధ్య, ఒక రైతు బిడ్డగా మట్టిని నమ్ముకుని పుట్టిన వ్యక్తి.. నేడు హైదరాబాద్ నగరం నలుమూలల కాంక్రీట్ కట్టడాలతో తన విజయ ముద్రను వేయడం వెనుక ఉన్నది కేవలం డబ్బు కాదు, ఒక అలుపెరగని పోరాటం. అవమానాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, విమర్శలు విన్నప్పుడు వెనక్కి తగ్గకుండా, తన నిజాయితీనే కవచంగా మార్చుకుని రియల్ ఎస్టేట్ రంగంలో 'ఐడియల్ ప్రాజెక్ట్స్' అనే ఒక అజేయమైన సామ్రాజ్యాన్ని నిర్మించిన *సురేష్ గారి* కథ ప్రతి నిరుపేద యువకుడికి ఒక దిక్సూచి. ఇది కేవలం ఒక వ్యాపారవేత్త ప్రయాణం కాదు.. ఇది ఆత్మవిశ్వాసానికి, కష్టానికి మధ్య జరిగిన ఒక గొప్ప సంగ్రామం. ఐడియల్ ప్రాజెక్ట్స్ సారధి సక్సెస్ ఫుల్ జర్నీపై ఎఎన్ఎన్ మహా ప్రత్యేక ఇంటర్వ్యూ

**మహా : మీ గ్రామీణ నేపథ్యం వ్యక్తిత్వాన్ని ఎలా తీర్చిదిద్దింది?**


**జ:** పశ్చిమ గోదావరి జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో పక్కా రైతు కుటుంబంలో పెరిగాను. ఒక రైతుకు ఉండే ఓర్పు, కష్టపడే తత్వం, ప్రకృతిని ప్రేమించే గుణం వారసత్వంగా వచ్చాయి. పొలంలో తండ్రి పడే కష్టం, తల్లి చేసే త్యాగం కళ్లారా చూశాను. ఆ మట్టి వాసన నాకు నేర్పిన పాఠం ఒక్కటే "నువ్వు నిజాయితీగా విత్తనం వేస్తే, కాలం నీకు గొప్ప ఫలాలను ఇస్తుంది". అదే సూత్రం నేడు వ్యాపార పునాదిగా మారింది.

**మహా : సామాన్య రైతు బిడ్డగా నగరానికి వచ్చినప్పుడు మీరు ఎదుర్కొన్న తొలి భావోద్వేగ సవాలు ఏమిటి?***

**జ:** పల్లెటూరి స్వచ్ఛత నుంచి నగరపు వేగంలోకి అడుగుపెట్టినప్పుడు, ఆయనకు మొదట ఎదురైనది అభద్రతా భావం కాదు, ఒక గొప్ప జిజ్ఞాస. ఇక్కడ ప్రతి మనిషికి ఒక సొంత ఇల్లు కావాలనే బలమైన కోరిక ఉంటుంది, కానీ అది అందరికీ ఎందుకు సాధ్యం కావడం లేదు? అనే ఆలోచన నన్ను తొలి అడుగులు వేయించింది. తన కుటుంబం పడ్డ ఆర్థిక ఇబ్బందులు ఇతరులు పడకూడదనే సంకల్పం నాలో అప్పుడే మొదలైంది.

**3. మహా: హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న రోజుల్లో మీ ఆలోచనా ధోరణి ఎలా ఉండేది?**

**జ:** ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆయన కేవలం జీతం కోసం పని చేయలేదు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా గమనించేవారు. ఒక సామాన్యుడు తన జీవితాంతం కష్టపడి సంపాదించిన డబ్బును ఒక ఇంటిపై పెట్టుబడిగా పెట్టినప్పుడు, ఆ బిల్డర్ ఇచ్చే గౌరవం ఎలా ఉండాలి? నాణ్యత ఎలా ఉండాలి? అనే విషయాలపై ఆయన ఒక స్వంత సిద్ధాంతాన్ని ఏర్పాటు చేసుకున్నారు.




**మహా : రియల్ ఎస్టేట్ రంగం వైపు మిమ్మల్ని నడిపించిన ఆ 'టర్నింగ్ పాయింట్' ఏమిటి?**

**జవాబు:** మార్కెట్లో పేరున్న బిల్డర్లు కూడా క్వాలిటీ విషయంలో రాజీ పడటం, మధ్యతరగతి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కాలయాపన చేయడం ఆయనను కలచివేసింది. "నేను ఎందుకు ఒక జెన్యూన్ బ్రాండ్‌ను సృష్టించకూడదు? తక్కువ లాభంతో ఎక్కువ మందికి ఆనందాన్ని ఎందుకు పంచకూడదు?" అనే ప్రశ్న నన్ను రియల్ ఎస్టేట్ ఎండిగా మార్చింది.

**మహా : వ్యాపారం ప్రారంభించిన కొత్తలో మీ ముందున్న అతిపెద్ద ఆర్థిక అడ్డంకి ఏమిటి?**

**జ:** నా కోట్లాది రూపాయల పెట్టుబడి లేదు. కానీ, 'విశ్వసనీయత' అనే గొప్ప ఆస్తి ఉంది. మొదట్లో చిన్న చిన్న అడుగులు వేస్తూ, వచ్చిన ప్రతి రూపాయిని మళ్ళీ వ్యాపారంలోనే పెడుతూ, దుబారా ఖర్చులకు దూరంగా ఉంటూ తన ఆర్థిక స్థోమతను పెంచుకున్నాను.

**మహా : సురేష్ గారికి సమాజం "బ్యాక్‌గ్రౌండ్ లేదు" అని ఎగతాళి చేసినప్పుడు మీ మానసిక స్థితి ఎలా ఉండేది?***

**జవాబు:** మనుషులు తక్కువ చేసి మాట్లాడినప్పుడు కోపం రాలేదు, ఒక వింతైన ధైర్యం కలిగింది. "చరిత్ర సృష్టించిన వారెవరూ గొప్ప బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారు కాదు, తమ కష్టాన్నే బ్యాక్‌గ్రౌండ్‌గా మార్చుకున్నవారే" అని నమ్మాను. విమర్శకుల నోళ్లు మూయించాలంటే వాదనలు కాదు, విజయాలే ముఖ్యమని మౌనంగా నా పనిని కొనసాగించాను.

**మహా : ప్రత్యర్థులు ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూసినప్పుడు ఎలా స్పందించారు?**

**జ:** రియల్ ఎస్టేట్ రంగంలో పోటీ దారుణం. ఆయన ఎదుగుదలను ఓర్వలేక కొందరు అడ్డంకులు సృష్టించినప్పుడు, ఆయన ఎక్కడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోలేదు లేదా కుంగిపోలేదు. ప్రతి అడ్డంకిని ఒక మెట్టుగా మార్చుకుని, చట్టబద్ధంగా, నిజాయితీగా ముందుకు సాగారు. ఆయన పనితీరులోని పారదర్శకతే ఆయనను రక్షించింది.

**మహా : "పల్లెటూరి నుంచి వచ్చి ఏం చేస్తాడు?" అన్నవారికి ఇచ్చిన సమాధానం ఏమిటి?**

**జ:** 30 భారీ ప్రాజెక్టుల నిర్మాణమే నా విజయం. ఒక రైతు బిడ్డకు ఉండే మొండితనం, ఒక పనిని మొదలుపెడితే అది పూర్తయ్యే వరకు నిద్రపోని తత్వమే విజయం. నేడు వేలాది మందికి అన్నదాతగా, వందలాది మందికి ఉపాధి ప్రదాతగా మారానంటే నా పట్టుదలే కారణం.

**మహా : మీ విజయ ప్రస్థానంలో భార్య సింధు దేవి గారి సహకారం ఎలా ఉంది?**

**జ:** ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందనే మాట నా విషయంలో అక్షర సత్యం. పడిపోయినప్పుడు చేయి అందించి, విమర్శలు వచ్చినప్పుడు ధైర్యం చెప్పి, వ్యాపార వ్యూహాల్లో భాగస్వామిగా నిలిచిన నా అర్ధాంగి సింధు దేవి నాకు ఒక శక్తి . భార్య ఇచ్చే మానసిక ప్రశాంతత వల్లే నేను బయట ప్రపంచంతో పోరాడగలిగాను.

**మహా : కుటుంబం మరియు వ్యాపారం మధ్య ఆయన ఎలా సమతుల్యత పాటిస్తారు?**

**జ:** ఎంత బిజీగా ఉన్నా, నా మూలాలను మర్చిపోను. కుటుంబం నాకు ఇచ్చే బలం, బాధ్యతలను గుర్తు చేస్తుంది. పిల్లలకు కూడా విలువలనే ఆస్తిగా ఇవ్వాలని నిరంతరం తపిస్తాను.

**మహా : 'ఐడియల్' అనే బ్రాండ్ కింద 30 ప్రాజెక్టులు పూర్తి చేయడం వెనుక ఉన్న రహస్యం ఏమిటి?**

**జ:** ఇక్కడ రహస్యం ఏమీ లేదు, కేవలం 'నిబద్ధత' మాత్రమే ఉంది. ఒక ప్రాజెక్ట్ మొదలుపెట్టే ముందే దానికి కావాల్సిన అన్ని వనరులను సమకూర్చుకోవడం, ఇంజనీర్లతో నిరంతరం చర్చించడం, క్వాలిటీ విషయంలో ఇసుమంతైనా రాజీ పడకపోవడం వల్ల ఇన్ని విజయాలను వరుసగా సాధించగలిగాను.

**మహా : కస్టమర్లతో ఆయనకు ఉండే అనుబంధం ఎలాంటిది?**

**జ:** కస్టమర్లను 'కొనుగోలుదారులు'గా చూడను, 'భాగస్వాములు'గా చూస్తాను. "నేను మీలో ఒకడిని" అని వారి కోణంలో ఆలోచిస్తాను. వారి కష్టార్జితాన్ని గౌరవించి, వారికి అత్యుత్తమ నివాసాన్ని అందించడమే ప్రథమ కర్తవ్యంగా భావిస్తాను.

**మహా : మార్కెట్ ధరల కంటే తక్కువ రేటుకు ఇళ్లు ఇవ్వడం వ్యాపారపరంగా సాధ్యమేనా?**

**జ:** అవును, సాధ్యమే. లాభం తక్కువగా ఉన్నా పర్వాలేదు, కానీ ప్రజలకు మేలు జరగాలనేది నా సిద్ధాంతం. వంద రూపాయల లాభం కంటే, వంద మంది కస్టమర్ల దీవెనలు గొప్పవని నమ్ముతాను. అందుకే తక్కువ మార్జిన్‌తో ఎక్కువ వాల్యూమ్ బిజినెస్ చేస్తారు.

**మహా : నిర్మాణ నాణ్యత విషయంలో పాటిస్తున్న ప్రమాణాలు ఏమిటి?**

**జవాబు:** సిమెంట్ నుండి స్టీల్ వరకు, పెయింటింగ్ నుండి ప్లంబింగ్ వరకు బ్రాండెడ్ వస్తువులనే వాడతారు. "మన ఇంటిని మనం ఎలా కట్టుకుంటామో, కస్టమర్ ఇంటిని కూడా అలాగే కట్టాలి" అనేది ఐడియల్ ప్రాజెక్ట్స్ నినాదం.

**మహా : ఆన్-టైమ్ డెలివరీ అనేది రియల్ ఎస్టేట్‌లో ఒక పెద్ద సమస్య. దీన్ని ఎలా అధిగమించారు?**

**జవాబు:** నా పనిలో ఒక క్రమశిక్షణ ఉంటుంది. లేబర్ మేనేజ్మెంట్ నుండి మెటీరియల్ సప్లై వరకు ఒక పక్కా ప్లానింగ్ ఉంటుంది. ఇచ్చిన మాట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయడం, తాళాలు అప్పగించడం మా సంస్థ యొక్క ట్రేడ్ మార్క్.

**మహా : సామాజిక సేవ అనేది ఒక బిల్డర్‌కు ఎందుకు ముఖ్యం అని ఆయన భావిస్తారు?**

**జవాబు:** బిల్డర్ అనే వ్యక్తి సమాజంలో ఒక అంతర్భాగం. సమాజం బాగుంటేనే వ్యాపారం బాగుంటుంది. కేవలం భవనాలు కట్టడం కాదు, మనుషుల మధ్య అనుబంధాలను కట్టడం కూడా ముఖ్యమని నా అభిప్రాయం.

**మహా : రాబోయే 12 కొత్త ప్రాజెక్టుల ప్రత్యేకత ఏమిటి?**

**జవాబు:** ఇవి కేవలం భవనాలు మాత్రమే కాదు, అత్యాధునిక సాంకేతికతతో, పర్యావరణ హితంగా రూపుదిద్దుకుంటున్న అద్భుత నివాసాలు. మధ్యతరగతికి 'లగ్జరీ'ని అందుబాటులోకి తేవడమే వీటి లక్ష్యం. ప్రతి సామాన్యుడు ఇల్లు కొనాలనుకుంటే మొదట 'ఐడియల్' పేరే గుర్తుకు రావాలని, అదీ ఒక 'నమ్మకమైన చిరునామా'గా నిలవాలని నా కోరిక.

**మహా : మీ నాయకత్వ శైలి ఎలాంటిది?**

**జ:** ఆయన ఒక 'గ్రౌండ్ లెవల్ లీడర్'. ఏసీ రూముల్లో కూర్చుని ఆర్డర్లు వేయడం నాకు ఇష్టం ఉండదు. స్వయంగా సైట్‌కు వెళ్లి, ఇటుకలు ఎలా పెడుతున్నారు, సిమెంట్ మిశ్రమం ఎలా ఉంది అని దగ్గరుండి చూస్తాను. తన టీమ్‌లో చివరి ఉద్యోగితో కూడా ఆయన నేరుగా మాట్లాడుతారు. నాయకుడు అంటే నడిపించేవాడు కాదు, అందరితో కలిసి నడిచేవాడు అని ఆయన నిరూపిస్తారు.

***ఐడియల్ ప్రాజెక్ట్స్ ఎండి సురేష్ *కేవలం బిల్డింగ్‌లు కట్టే మేస్త్రీ కాదు, ఆయన వేలాది కుటుంబాల ఆశలకు ప్రాణం పోసే ఒక శిల్పి. పశ్చిమ గోదావరి మట్టిలో పుట్టిన ఈ మాణిక్యం, తన కష్టంతో, నిజాయితీతో నేడు మెరుస్తోంది. విమర్శల తుపానులను ఎదుర్కొని, అవమానాల సముద్రాన్ని ఈది, విజయ తీరానికి చేరిన ఆయన ప్రయాణం అక్షరాలా ప్రతి భారతీయుడికి గర్వకారణం. ఆయన మరిన్ని అద్భుతమైన ప్రాజెక్టులు చేపట్టి, సమాజానికి ఇంకా ఎంతో సేవ చేయాలని ఆకాంక్షిద్దాం.**

# సంక్షేమానికి కొత్త ప్రమాణం...

## సన్నబియ్యం పథకం ఏడాది విశ్లేషణ





తెలంగాణలో సంక్షేమ పాలనకు కొత్త నిర్వచనాన్ని అందించిన కార్యక్రమాల్లో 'సన్నబియ్యం పంపిణీ పథకం' ఒక మైలురాయి. ఆకలి తీర్చడం మాత్రమే కాకుండా, పేదల భోజన నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా తీసుకున్న ఈ నిర్ణయం, సామాజిక న్యాయం వైపు ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం, కేవలం ఒక సంక్షేమ చర్యగా కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దీర్ఘకాలిక సామాజిక మార్పుకు దారితీస్తోంది.

గత ఏడాది మార్చి 30న హుజూర్‌నగర్‌లో ప్రారంభమైన ఈ పథకం, ఒక సంవత్సరాన్ని పూర్తి చేసుకుంది. ఈ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.10 కోట్ల మంది లబ్ధిదారులకు నాణ్యమైన సన్నబియ్యం అందింది. సుమారు 90 లక్షల రేషన్ కార్డుల ద్వారా ప్రతి నెలా 6 కిలోల చొప్పున పంపిణీ జరగడం, ప్రభుత్వ యంత్రాంగ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇప్పటివరకు 2.79 కోట్ల కిలోల సన్నబియ్యం పంపిణీ కావడం, ఈ పథకం విస్తృతిని స్పష్టంగా చూపుతోంది.

గతంలో పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (PDS) ద్వారా అందించే బియ్యం నాణ్యతపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి తెలిసిందే. రేషన్ బియ్యం అంటే తక్కువ నాణ్యత, ఆరోగ్యానికి అంతగా మేలు చేయని ఆహారం అనే అభిప్రాయం ఉండేది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న సన్నబియ్యం పంపిణీ నిర్ణయం, ఆ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేసింది. మంచి నాణ్యత గల బియ్యం అందడంతో లబ్ధిదారుల జీవన శైలిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.ఆహార సాంకేతికత శాఖ అధ్యయనం ప్రకారం, సన్నబియ్యం సాధారణ బియ్యానికి పోల్చితే 1520% ఎక్కువ పోషకాంశాలు కలిగి ఉండటం వల్ల పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు మరింత మేలు చేస్తోంది. పేదలకు కూడా నాణ్యమైన ఆహారం అందించాలి అనే భావనను ప్రభుత్వం కార్యరూపంలో చూపించడం, సంక్షేమ పాలనలో ఒక పెద్ద ముందడుగు. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ ఈ పథకం సమానంగా అమలవడం, సమగ్ర అభివృద్ధి దిశగా రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను తెలియజేస్తోంది.

దేశంలోనే తొలిసారిగా రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఉచిత పంపిణీ చేసిన తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచింది. కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, దేశవ్యాప్తంగా PDS (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్)లో 80% రాష్ట్రాలు సాధారణ బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నాయి, కానీ తెలంగాణ మాత్రం నాణ్యతపై దృష్టి పెట్టి ప్రత్యేకత చూపింది. ఈ పథకం విషయంలో ప్రజల స్పందన అద్భుతం. ఆహార విభాగం సర్వే ప్రకారం, 92 శాతం మంది లబ్ధిదారులు 'బాగుంది' అని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ లబ్ధిదారులు ఈ పథకాన్ని ప్రశంసిస్తున్నారు.

ఈ పథకం ఆర్థిక పరంగా కూడా పేదలకు గొప్ప ఊరట కలిగిస్తోంది. మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.6070 మధ్య ఉంటే, నెలకు 6 కిలోలు ఉచితంగా అందించడం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.360420 వరకు ఆదా అవుతోంది.90 లక్షల కుటుంబాలకు ఇది సంవత్సరానికి రూ.3,888 కోట్ల ఆర్థిక భరోసాగా మారుతోంది. ఈ ఆదాను పేదలు పిల్లల చదువు, వైద్యం, ఇతర అవసరాలకు వినియోగించడం వల్ల వారి జీవన స్థాయి మెరుగుపడుతోంది. మరో ముఖ్య అంశం అక్రమ రవాణా తగ్గుదల. గతంలో తక్కువ నాణ్యత గల రేషన్ బియ్యాన్ని మధ్యవర్తులు కొనుగోలు చేసి మార్కెట్‌లో విక్రయించే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు నాణ్యమైన సన్నబియ్యం అందడంతో లబ్ధిదారులు స్వయంగా వినియోగిస్తున్నారు. దీంతో బియ్యం అక్రమ రవాణా గణనీయంగా తగ్గడం, ప్రభుత్వానికి నష్టాలు తగ్గడం జరిగింది. ఇది పారదర్శక పాలనకు ఒక నిదర్శనం.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా మార్చింది. డిజిటల్ రేషన్ కార్డులు, ఆధార్ లింకింగ్, బయోమెట్రిక్ ధృవీకరణ వంటి చర్యలు సరఫరా వ్యవస్థలో పారదర్శకతను పెంచాయి. రేషన్ షాపుల నిర్వహణలో కూడా మెరుగుదలలు కనిపిస్తున్నాయి. అయితే, కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో సరఫరా ఆలస్యాలు, నాణ్యతపై ఫిర్యాదులు వినిపించాయి. కానీ ప్రభుత్వం వాటిని వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం, పాలనలో చురుకుదనాన్ని చూపుతోంది. హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం పరిష్కారం కావడం, వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతోంది.

సన్నబియ్యం పంపిణీ పథకం కేవలం ఆహార భద్రతను మాత్రమే కాదు, సామాజిక గౌరవాన్ని కూడా

-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ

పెంచుతోంది. పేదలకు కూడా మంచి నాణ్యత గల ఆహారం తినే హక్కు ఉందనే భావనను ఇది బలపరుస్తోంది. ఇది సంక్షేమ రాష్ట్ర లక్షణాల్లో ఒకటి. ప్రభుత్వం చేపడుతున్న ఇతర పథకాలతో కలిసి ఈ కార్యక్రమం సమగ్ర సంక్షేమానికి దోహదపడుతోంది.

మొత్తంగా చూస్తే, సన్నబియ్యం పంపిణీ పథకం తెలంగాణలో ఒక సామాజిక విప్లవానికి నాంది పలికింది. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, ఆర్థిక భద్రత కూడా పెరిగింది. భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విస్తరించి, మరిన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే అవకాశాలు ఉన్నాయి. ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం, నిజంగా నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన చారిత్రాత్మక అడుగు.

## చిన్నారులు, గర్భిణీలకు నాణ్యమైన

# పౌష్టికాహారం అందించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదగిరిగుట్ట, మహా:** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహణ, అందిస్తున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో మొత్తం ఎంతమంది పిల్లలు నమోదు అయ్యారని , ప్రతి రోజు పిల్లలు ఎంత మంది అంగన్వాడీ కేంద్రానికి వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.పిల్లలకు ప్రతిరోజు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన ఆహారంఅందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు పిల్లలకు వడ్డించిన భోజనాన్ని స్వయంగా పరిశీలించి, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో తనిఖీ చేశారు. ఆహారం తయారీలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.చిన్నారుల పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.రోజువారీగా పిల్లలకు నిర్వహించే విద్యా, వినోద కార్యక్రమాలు ఏమిటి అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో స్వయంగా మాట్లాడి, ఏబీసీడీలు చెప్పించడంతో పాటు వారి ప్రతిభను ప్రోత్సహించారు. గర్భిణీలు, బాలింతలకు అందించే సేవలు కూడా సక్రమంగా ఉండాలని, వారికి అవసరమైన పోషకాహారం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.అంగన్వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహా న్యూస్ కథనానికి స్పందించిన ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**స్పందనకి వందనం**

**వలిగొండ, మహా:** వలిగొండ మండలంలోని చిత్తాపురం గోపరాజు పల్లి రోడ్డు వెంబడి గత మూడు రోజుల క్రితం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం చెట్లను నరికి వేసిన విషయం మహా న్యూస్ లో గత మూడు రోజుల క్రితం ప్రచురితమైంది కథనానికి స్పందించిన ఎంపీడీవో జలంధర్ రెడ్డి చొరవతో చెట్లు నరికివేత కుకారణమైన వ్యక్తికి నోటీసులు జారీ చేసి జరిమానా విధించారు తొలగించిన చెట్ల స్థానంలో కొత్త చెట్లను నాటించినట్లు తెలిపారు

## రైలింగ్ వాల్ సమీపంలో పొంచి ఉన్న ప్రమాదం...

# తక్షణ చర్యలు అవసరం



**బూర్గంపహాడ్ మహా :** సారపాక రెండవ కొత్తవార్డు పరిధిలో ప్రధాన రహదారి పక్కన ఉన్న రైలింగ్ వాల్ సమీపంలో ప్రమాదం పొంచి ఉన్న పరిస్థితులు స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. రహదారి పక్కభాగం పలుచోట్ల కోతకు గురై బలహీనంగా మారడంతో ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రత్యేకంగా భారీ వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. రహదారి అంచులు క్రమంగా కూలిపోతుండటంతో వాహనాలు జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టకపోతే ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఆ ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల దుర్వాసన వ్యాపిస్తోంది. ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాకుండా, రహదారి పక్క భాగాన్ని మరింత దెబ్బతీస్తూ ప్రమాదాలకు దారితీస్తోందని ప్రజలు అంటున్నారు. గ్రామస్థులు పలు మార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని వారు స్పష్టం చేస్తున్నారు.

**డిమాండ్లు...**

వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టాలికోతకు గురైన ప్రాంతాల్లో బలమైన రక్షణ గోడలు నిర్మించాలిచెత్తాచెదారం తొలగించి పరిశుభ్రత కల్పించాలిప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలిప్రమాదం ఎప్పుడైనా సంభవించే పరిస్థితి ఉన్న నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కార్మికుల కష్టాన్ని పట్టించుకోని ఐటీసీ యాజమాన్యం

**కోట్లలో ఆదాయం... కార్మికులకు మాత్రం శూన్యం**



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో ఉన్న ఐటీసీ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. పరిశ్రమకు కోట్లలో ఆదాయం వస్తున్నప్పటికీ, కార్మికుల జీవన పరిస్థితులు మాత్రం రోజురోజుకు దయనీయంగా మారుతున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ నాయకులు పలుమార్లు యాజమాన్యానికి కార్మికుల సమస్యలను వివరించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వేతన ఒప్పందాలపై చర్చలు జరపాలని చేసిన విజ్ఞప్తులను యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు.

**14వ రోజుకు చేరిన నిరాహార దీక్షలు**

కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నేటితో 14వ రోజుకు చేరుకున్నాయి. అయినప్పటికీ యాజమాన్యం గానీ, పరిశ్రమలో గెలుపొందిన యూనియన్ గానీ స్పందించకపోవడం కార్మికుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది.జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దీక్షలకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. ఈ రోజు జరిగిన నిరాహార దీక్షలో తోకలు నరేష్‌తో పాటు ప్లాంటేషన్ మహిళా కార్మికులు బోల్ల సమ్మక, దార్ల కవిత, పట్రా సుమిత్ర, గంధం సిరి పాల్గొన్నారు.

**జేఏసీ నేతల హెచ్చరిక**

ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కోకన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లం నాగయ్య, ఆకినీ సర్వేశ్వర తదితరులు మాట్లాడుతూ "కాంట్రాక్ట్ కార్మికుల వేతన ఒప్పంద చర్చలు వెంటనే ప్రారంభించాలి. లేకపోతే నిరసనలు మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.కార్మికులకు మద్దతుగా రామిశెట్టి లక్ష్మీతో పాటు జేఏసీ సభ్యులు కందాల వెంకట్ రెడ్డి, సుంకిరెడ్డి వెంకట్ రెడ్డి, మర్రి వెంకట్ రెడ్డి, చుక్కపల్లి బాలాజీ, సురిశెట్టి జగదీష్ పాల్గొని దీక్షను ప్రారంభించారు.

**మహిళా కార్మికుల ఆవేదన**

**ప్లాంటేషన్ మహిళా కార్మికులు మాట్లాడుతూ —**

"పరిశ్రమ లాభాలు పెరుగుతున్నా, మా పరిస్థితి మాత్రం మారడం లేదు. కనీస వేతనాల విషయంలో కూడా న్యాయం జరగడం లేదు. వెంటనే జేఏసీతో చర్చలు జరపాలి" అని డిమాండ్ చేశారు.

**పరిష్కారం లేకపోతే ఆందోళనలు తీవ్రం**

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో ఆందోళనలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముందని జేఏసీ నాయకులు హెచ్చరిస్తున్నారు. యాజమాన్యం తన మొండి వైఖరిని విడిచి పెట్టి, కార్మికుల పట్ల సహానుభూతితో వ్యవహరించాలని కార్మికులు కోరుతున్నారు.

## ఐఎఫ్‌టీయూ నిరసన.. లేబర్ కోడ్‌ల దహనం..



**మణుగూరు, మహా :** కేంద్ర కమిటీ పిలుపు మేరకు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం మణుగూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. షహీద్ భగత్ సింగ్, బట్‌కేశ్వర్ దత్‌లు బ్రిటిష్ పార్లమెంటులో బాంబులు విసిరి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా శపథం చేసిన దినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్మిక హక్కులను హరించేలా ఉన్న లేబర్ కోడ్‌లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, కార్మికులందరూ వ్యతిరేక పోరాటానికి సిద్ధం కావాలని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్, నాయకులు కే గురుమూర్తి, జి నాగేశ్వరరావు, కే నాగేశ్వరరావు, యు శివరామకృష్ణ, ఐ గోపి, జి శ్రీనివాసరావు, కే నాగరాజు, షేక్ రజబ్ అలీ, ఈ పవన్ కుమార్, వై శంకర్, ఎం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాడు అడవులను అంతం చేశారు...

- నేడు పల్లెల్లో పచ్చని చెట్లను మింగేస్తున్నారు..
- కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ లో... కంచే చేను మేస్తోంది..
- అక్రమ పర్మిట్ల తో అక్రమాలు..



**కారేపల్లి, మహా:** కారేపల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న నిర్మల హృదయి డిగ్రీ కళాశాల దాని పరిసరాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా పచ్చని చెట్లు నరికి ట్రాక్టర్ లో లోడ్ చేస్తున్నారని ఫారెస్ట్ అధికారులకు సమాచారం చేరింది... ఈ సమాచారంతో ఫారెస్ట్ అధికారులు ప్రదేశానికి వెళ్లి ట్రాక్టర్ ను కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. అందులో వేప మొద్దులతో పాటు ఇతర అటవీయేతర జాతుల కలప కూడా ఉంది. పట్టుకున్న గంట తరువాత ఫారెస్ట్ అధికారు లు ఓ ప్రెస్ నోట్ ను విడుదల చేశారు. ట్రాక్టర్ ను తనిఖీ చేయగా అందులో అటవీఏతర జాతులకు సంబంధించిన కలప మాత్రమే ఉంది కాబట్టి వాటికి కూడా వారు అనుమతులు తీసుకోలేదు కాబట్టి పదివేల రూపాయల జరిమానాను కలప వ్యాపారి బందెల్లి కి విధించి ట్రాక్టర్ను విడిచి పెడుతున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ లో అటవీ జాతికి చెందిన వేప కలప ఉన్నప్పటికీ ఆ కలపలేదని నిర్ధారిస్తూ ఫారెస్ట్ అధికారులు అక్రమానికి పాల్పడ్డారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి, కొందరు పత్రికా విలేకరులు ఆ ట్రాక్టర్ లో వేప కలప ను చూసి ఫోటోలు కూడా తీసుకున్నారు. అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ కలప వ్యాపారి వద్ద మామూలు తీసుకొని ట్రాక్టర్ ను నామమాత్రపు జరిమానాతో వదిలేసారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కలప వ్యాపారి కేసు పరిశీలించాల్సిన ఫారెస్టు అధికారి ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కాబట్టి ఏదైనా సాధ్య పడుతుందని ఈ సంఘటనపై బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ సంఘటన ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతంలో జరిగింది కాదు అటవీ రేంజ్ కార్యాలయానికి అర కిలోమీటర్ దూరంలో మంగళవారం కారేపల్లి లో చోటుచేసుకున్న సంఘటన ఇది.... కంచే చేను మేసిన చందంగా ఇలాంటి అక్రమాలు కారేపల్లి అటవీ రేంజ్ లో కోకొల్లలుగా జరుగుతున్నా అటవీ శాఖ ఉన్నతాధికారులు ప్రేక్షక పాత్ర వహించడంతో ఇక్కడ జరుగుతున్న అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందనే ఆరోపణలు ఉన్నాయి.

**అతిపెద్ద రేంజ్ లో అడవులు అంతరించాయి**

జిల్లాలోనే అతి పెద్ద రేంజ్ గా ఉన్న కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ లో అడవి ఆనవాళ్లు కోల్పోతోంది. రేంజ్ పరిధిలో 20 వేల ఎకరాల విస్తీర్ణంలో దట్టమైన అడవులు నాడు నిండు పచ్చదనంతో వున్న అడవులు నేడు ఆక్రమణకు గురై కేవలం గుట్టలు మాత్రమే మిగిలివున్నాయి. ఫారెస్ట్ అధికారులు వాటిని కూడా కాపాడలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. అటవీ భూములను, అటవీ సంపదను, ఏజెన్సీ ప్రాంతాల్లో పెరుగుతున్న పచ్చని చెట్లను కాపాడాల్సిన అటవీ అధికారులు మామూళ్లకు అలవాటు పడి అక్రమాలకు పాల్పడుతున్నారు.

**రంగురాళ్లబోడు లో వందల చెట్లను నరికారు...**

కారేపల్లి అటవీ రేంజ్ పరిధిలోని రంగురాళ్ల బోడు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో గత ఏడాది నుంచి వందకు పైగా భారీ వృక్షాలను నరికి సుమారు పదెకరాల ఫారెస్ట్ భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతానికి చెందిన ఓ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ప్రమేయం తోనే అటవీ భూమి అక్రమనకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ ఫారెస్ట్ ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టకపోవడం తో అక్కడి ఆక్రమణదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతోంది. రంగురాళ్ళ బోడు అక్రమణలపై ఇప్పటికే ఫారెస్ట్ అధికారులు 8 కేసులు నమోదు చేసి నప్పటికీ కబ్జాదారులను కట్టడి చేయడంలో విఫలమయ్యారని ఆరోపణలు ఉన్నాయి. ఆరు నెలల క్రితం వరకూ ఇక్కడ పనిచేసిన ఫారెస్ట్ సిబ్బంది కూడా కబ్జాదారులకు సహకరించారు కాబట్టి వారు వందలాది చెట్లు మిషన్లతో నరికారని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం రంగురాళ్లబోడు కబ్జాలను అరికట్టేందుకు సమర్థవంతమైన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ను వేసినప్పటికీ ఫారెస్ట్ ఉన్నత అధికారులు కఠిన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అక్రమ పర్మిట్లు...**

కారేపల్లి మండలంలో 41 గ్రామపంచాయతీల్లో మండల కేంద్రమైన కారేపల్లి, అబ్బాయిగూడెం మినహా మిగతా అన్ని పంచాయతీలు ఏజెన్సీ గ్రామాలే. ఈ గ్రామాల పరిధిలోని ,వేప, చింత,తుమ్మ తదితర చెట్లను నరికి కలపను తరలించడానికి వాల్టా చట్టం ప్రకారం అనుమతులు లేవు. కానీ వందలాది ట్రిప్పుల కలప గత కొన్నేళ్లుగా ఈ ఏజెన్సీ ప్రాంతం నుంచి తరలిపోతోంది. వీటిల్లో చాలా వరకు కారేపల్లి పేరుతో పర్మిట్లు ఇచ్చి కొందరు అటవీ శాఖ సిబ్బందే సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోనీ కలపను నాన్ ఏజెన్సీ గ్రామమైన కారేపల్లి పేరుతో పర్మిట్లు తీసుకుని పర్మిట్లు ఇచ్చిన వారికి కొంత ముట్ట చెప్పి గుట్టుచప్పుడు కాకుండా ఈ అక్రమం కొందరి ఫారెస్ట్ సిబ్బంది కనుసన్నల్లోనే సాగుతోంది. నాన్ ఏజెన్సీ గ్రామమైన కారేపల్లి ప్రాంతం రొండు కిలోమీటర్ల పరిధిలో తక్కువ విస్తీర్ణంలోనే ఉంది. ఈ పరిధిలో కొట్టిన చెట్లు నామమాత్రమే.

**300 టేకు చెట్లు ఎలా తరలిపోయాయి..**

కారేపల్లి అటవీ రేంజ్ ఆఫీస్ కు రొండో కిలోమీటర్ల దూరంలో పేరుపల్లికి చెందిన ఓ రైతు మల్లన్నగూడెం రోడ్డు ప్రాంతంలో పొలం గట్ల మీద సుమారు 300 టేకు చెట్లను పెంచాడు. ఈ టేకు చెట్లన్నీ పూర్తి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నాయి. ఎటువంటి అనమతుల్లేకుండా ఈ టేకు చెట్లన్నీ మాయమై ఆ ప్రాంతంలో మొట్లు మాత్రం సాక్ష్యంగా మిగిలాయి. ఆ సాక్షాలను కూడా లేకుండా ఇటీవల వాటిని కూడా తొలగించారు. ఈ టేకు చెట్లను నరికించి అక్రమంగా తరలించిన వ్యవహారం కూడా కొందరి ఫారెస్ట్ సిబ్బంది కనుసన్నల్లోనే జరిగిందనే ఆరోపణలున్నాయి. కారేపల్లి అటవీ రేంజ్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై ఫారెస్ట్ ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

**ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** తాగునీరు వైద్యం మౌలిక వసతుల కల్పించే విషయంలో ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లుగా ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామ సహాయం రఘురామిరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐ డి ఓ సి కార్యాలయంలో దిశా సర్వసభ్య సమావేశం బుధవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ రామ సహాయం రఘు రామ్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయాలని ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పనుల పురోగతిని నివేదికల రూపంలో ఎప్పటికప్పుడు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి గత నిర్ణయాలను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టంగా సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇచ్చేదని ఇప్పుడు కేవలం 60 శాతం మాత్రమే ఇచ్చే విధంగా మార్పు చేసిందన్నారు. మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. అదేవిధంగా గృహ నిర్మాణ శాఖలో అనేక మార్పులు రావడం వలన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో సమస్యలు తలెత్తుతున్నాయని ఈ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర చర్చ జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమని ప్రతి పథకం లక్ష్యాలకు అనుగుణంగా లబ్ధిదారులకు సమయానికి ప్రయోజనాలు చేరేలా పర్యవేక్షణ పెంచాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరా వైద్య సేవలు విద్యుత్ వంటి ప్రాథమిక సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. మణుగూరు, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రుల పరిశుభ్రత ఆహార నాణ్యత మరుగుదొడ్ల నిర్వహణ అంబులెన్స్ డయాలసిస్ సేవల విస్తరణ సికిల్ సెల్ అనీమియా హెచ్పీవీ వ్యాక్సిన్ అవగాహన కార్యక్రమాలపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ, అమృత్ పథకాల కింద తాగునీటి సరఫరా పైప్‌లైన్‌లీకేజీలను తొలగించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీల లో త్రాగునీటి సరఫరా పనులను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.జాతీయ రహదారులు ఆర్ అండ్ బి విద్యుత్ శాఖల పనుల ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి ఐటీడీఏ నిధులతో చేపట్టిన పనులలో ఆలస్యానికి కారణాలను వివరించాలని అధికారులు నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి..**

మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్రంగా చర్చించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మారుమూల ప్రాంతాల వరకు త్రాగునీటి సరఫరా కల్పించాలని ఆసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయడం కోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దిశా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రాధాన్యతగా తీసుకుని వాటి అమలును వేగవంతం చేయాలని ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో చేరేలా పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా వైద్య సేవలు విద్యుత్ వంటి ప్రాథమిక సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. శాసన సభ్యుల తమ నియోజకవర్గ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై అధికారులు సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు తమ నియోజకవర్గాల్లో పథకాల అమలు స్థితిగతులపై అధికారుల నుంచి నివేదికలు కోరారు. ఈ సమావేశంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, అశ్వరావుపేట మున్సిపల్ చైర్ పర్సన్ శశికళ, డి ఆర్ డి ఓ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు, కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్, దిశా కమిటీ సభ్యులు బుర్ర సురేష్, యేసుమని, స్వర్ణ జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## క్వార్టర్ ఫైనల్ దశకు చేరిన చర్ల

# టీ-10 క్రికెట్ పోటీలు

**చర్ల మహా :** చర్లలో జరుగుతున్న టీ10 అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతూ క్వార్టర్ ఫైనల్ దశకు చేరుకున్నాయి. ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతమైన క్రికెట్ క్రీడాకారులు ఇప్పటికే చర్లకు చేరుకుని తమ జట్లతో పోటీలో పాల్గొంటున్నారు. ప్రతి మ్యాచ్ ఆసక్తికరంగా మారుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా, స్థానికంగా పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు హాజరై ఆటగాళ్లకు ఉత్సాహం నింపుతున్నారు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో విజయం సాధించిన జట్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించనున్నాయి. ఇక ఈ టోర్నమెంట్‌కు మరింత ప్రత్యేక ఆకర్షణగా సెమీ ఫైనల్ మరియు ఫైనల్ మ్యాచ్‌లలో ఐఎస్పీఎల్ (ISPL) ప్లేయర్లు ఎంట్రీ ఇవ్వనున్నారు. దీంతో మ్యాచ్‌లపై మరింత ఆసక్తి నెలకొంది. చర్లలో క్రికెట్ పండుగ వాతావరణం నెలకొని, యువత నిర్వహణలో పోటీలు విజయవంతంగా కొనసాగుతున్నాయి.

## గోదావరి పుష్కరాల నాటికి తొలి దశ ఆలయ

# అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** గోదావరి పుష్కరాల నాటికి తొలి దశ ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి పనుల పురోగతిపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆర్కిటెక్ట్ కృష్ణమూర్తి కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, దేవస్థానం ఈవో దామోదర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనులను చేపడుతోందని తెలిపారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. మూడు దశలలో చేపట్టనున్న ఈ ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా మొదటి దశ పనులను గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేసి వచ్చే వారంలోనే నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల ప్రారంభానికి ముందు నిత్యకళ్యాణ మండపం దాసాంజనేయస్వామి మండపం చిత్రకూట మండపం దేవస్థానం కార్యాలయం తూర్పు ప్రసాద కౌంటర్లు మ్యూజియం అద్దాల మండపం వంటి నిర్మాణాలను తొలగించాల్సి ఉండటంతో పాటు ఆలయ నిత్య కార్యక్రమాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ భవనాల ఏర్పాటును వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పనులకు అవసరమైన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి నిర్దేశిత కాలవ్యవధిలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆలయ అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కరాల నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చుతూ పుష్కర ఘాట్ల నిర్మాణం వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

**అభివృద్ధి విషయంలో అన్ని చర్యలు తీసుకున్నాం..**

భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ దేవస్థానం ఆలయ అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తామని ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమిస్తామని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పనుల అమలులో ఎటువంటి ఆలస్యానికి తావు లేకుండా వేగవంతంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఎక్కడైనా ఆలస్యం తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. అదేవిధంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకొని పనులను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరావు, దేవస్థానం డి ఈ రవీంద్రనాథ్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతి రావు పూలే డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుందాం

**సింగరేణి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** మహాత్మా జ్యోతి రావు పూలే డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకుందామని సింగరేణి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్ అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయ జిఎం పర్సనల్ ఛాంబర్ నందు బుధవారం మహాత్మా జ్యోతి రావు పూలే డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల ఏర్పాట్ల గురించి ఎస్సి ఎస్టి బిసి ఎంప్లాయిస్ నాయకుల తో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ పర్సనల్ జివి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన నిర్వహించే మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను, 14వ తేదీన జరిగే డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేకంగా బడ్జెట్ ను కేటాయించి ఏర్పాట్లను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమాలలో సింగరేణీయులందరూ పాల్గొని మహాత్మా జ్యోతి రావు పూలే, డాక్టర్ బిఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఎస్సి ఎస్టి అసోసియేషన్ జనరల్ సెక్రటరీలు అంతోటి నాగేశ్వర్ రావు, జి.లింగమూర్తి, ఎస్టి అసోసియేషన్ జనరల్ సెక్రటరీలు బి.నాగేశ్వర రావు, ఎస్టి అసోసియేషన్ ప్రెసిడెంట్ లు డి.పంతులా, జి.రమేష్, ఎస్టి లైజన్ ఆఫీసర్ కే.హాతిరామ్, ఎస్సి లైజన్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, బిసి లైజన్ ఆఫీసర్ వి.మురళి, బిసి అసోసియేషన్ చీఫ్ లైసన్ హరిశంకర్ రావు, డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణరావు, బి.శివకేశవరావు, ముకుంద సత్యనారాయణ, జి.వెంకటేశ్వర్లు, కే.వి. ప్రకాష్, ఏ.భాస్కర్ రావు, ఎం.రాంబాబు ఇతర ఎస్సి ఎస్టి అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మణుగూరు వైద్యులకు అవార్డులు..

- డాక్టర్ గౌరీ ప్రసాద్‌కు ఉత్తమ సేవల అవార్డు..
- మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ప్రధానం..
- డాక్టర్ సునిల్‌కు ఉత్తమ వైద్యుడు అవార్డు..
- అవార్డు సిబ్బందికి అంకితం..
- వైద్యులకు ఘన సన్మానం..



**మణుగూరు, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసిన ఉత్తమ సేవల అవార్డు అందుకున్న మణుగూరు ప్రభుత్వ ఏరియా వంద పడకల దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ముత్తినేని గౌరీ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.డాక్టర్ గౌరీ ప్రసాద్ విశిష్ట వైద్య సేవలకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రాష్ట్ర ప్రభుత్వ తరపున అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ శాలువాతో సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాండ్ల సురేష్ మాట్లాడుతూ, నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న డాక్టర్ గౌరీ ప్రసాద్ ఎంతోమంది యువ వైద్యులకు ఆదర్శమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

**డాక్టర్ సునిల్‌కు ఉత్తమ వైద్యుడు అవార్డు..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వేల్పుల సునిల్ ఉత్తమ వైద్యుడు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సునిల్ ఆసుపత్రి సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తన ఒక్కరిదే కాదని, ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి సాధన అని పేర్కొన్నారు.సిబ్బంది అంకితభావం, రోగుల పట్ల చూపుతున్న మానవత్వం, సేవాభావమే ఈ గుర్తింపుకు కారణమని ఆయన తెలిపారు. ప్రతిరోజూ సిబ్బంది చేస్తున్న కృషి, సమన్వయం వల్లే ఆసుపత్రి మెరుగైన సేవలు అందించగలుగుతోందని చెప్పారు. సమర్థవంతమైన బృందంతో కలిసి పనిచేయడం గర్వంగా ఉందని, సిబ్బంది సహకారం, నమ్మకం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని వివరించారు. ఇదే ఉత్సాహంతో, సేవా భావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, పరిపాలన విభాగం సిబ్బంది, ఇతర ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పేదల వద్దకే మెరుగైన వైద్యం మంత్రి కోమటిరెడ్డి..

- నల్గొండలో కోమటిరెడ్డి మార్క్ అభివృద్ధి..
- మాన్యం చెల్కలో అత్యాధునిక యూపీహెచ్‌సీ ప్రారంభం ..
- ప్రభుత్వ నిధులు, ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో రూ. 2.41 కోట్లతో సౌకర్యాలు..






**నల్గొండ, మహా :** రాష్ట్రంలోని పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ నెల 6 నుండి 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలో పర్యటించారు. జిల్లా కేంద్రంలోని మాన్యం చెల్కలో రూ. 1.91 కోట్ల ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిపై రోగుల ఒత్తిడి విపరీతంగా పెరిగిపోతున్న విషయాన్ని గమనించి శివారు ప్రాంత ప్రజలకు చెంతనే వైద్యం అందించేందుకు ఈ కేంద్రాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఈ యూపీహెచ్‌సీకి కేవలం భవనమే కాకుండా తన కుమారుడి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అదనంగా రూ. 50 లక్షల వ్యయంతో అత్యాధునిక మెడికల్ ఎక్విప్మెంట్, ఫర్నిచర్ మరియు అవసరమైన అదనపు డాక్టర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులోనూ మాన్యం చెల్క ఆసుపత్రికి అవసరమైన మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా చుట్టుపక్కల ప్రాంతాల్లోని గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు ఈ కేంద్రం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఇక్కడే అన్ని రకాల వైద్య సేవలు పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. తీవ్రమైన సమస్యలు ఉంటేనే ప్రధాన ఆసుపత్రికి రిఫర్ చేయాలన్నారు. నల్గొండ కార్పొరేషన్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా మెరుగుపరచడంతో పాటు అత్యుత్తమ వైద్య సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి తెలిపారు. స్థానిక కార్పొరేటర్లు తమ వార్డుల్లో వివిధ జబ్బులతో బాధపడే పేదలను గుర్తించి, ఈ ఆరోగ్య కేంద్రానికి పంపించి వారికి వైద్యం అందేలా చూడాలని కోరారు. అలాగే ప్రతీక్ ఫౌండేషన్ మరియు ప్రఖ్యాత ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలో మూడు ఎకరాల స్థలంలో అత్యాధునిక కంటి ఆసుపత్రిని నిర్మించేందుకు వేగంగా అడుగులు వేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

ఒకవేళ ప్రభుత్వ కోటాలో మందులు అందుబాటులో లేకుంటే, ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒక ప్రైవేట్ మెడికల్ షాపును అనుసంధానం చేశామని డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా అక్కడి నుండి పేదలకు ఉచితంగా మందులు అందజేస్తామని వెల్లడించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అక్షయ ఫౌండేషన్ సహకారంతో భోజన సౌకర్యం కల్పించే ఆలోచన కూడా ఉందని మంత్రి తెలిపారు. వైద్యులు, ఆశా వర్కర్లు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని మాన్యం చెల్క చౌరస్తాను మరింత సుందరీకరించి విస్తరిస్తామని మంత్రి వివరించారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మాన్యం చెల్కతో పాటు చుట్టుపక్కల వార్డుల ప్రజలకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ. 50 లక్షల సొంత నిధులు వెచ్చించినందుకు మంత్రిని అభినందించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలలో మంత్రి తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆరోగ్య ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పీవీ (HPV) వ్యాక్సిన్‌ను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రికి అదనపు సౌకర్యాల కోసం మంత్రి సహకారాన్ని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, జిల్లా వైద్యాధికారి, ఆసుపత్రి సూపరింటిండెంట్ నరసింహారావు నేత, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఏరియాలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల ఏర్పాట్లపై..

# సింగరేణి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం



**మణుగూరు, మహా :** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు యాజమాన్యం నిర్ణయించింది. ఈ వేడుకల నిర్వహణపై చర్చించేందుకు బుధవారం సింగరేణి ఏరియా జీఎం కార్యాలయంలోని ఎస్ఓ టు జిఎం ఛాంబర్లో ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇంచార్జ్ ఎస్ఓ టు జిఎం వేణు మాధవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పూలే జయంతి కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఏప్రిల్ 11, 2026న సాయంత్రం 5 గంటలకు పీవీ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించడం, ఆయన సమాజానికి చేసిన విశేష సేవలను స్మరించుకోవడం జరుగుతుందని వివరించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సకాలంలో కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని యాజమాన్యం, నిర్వాహక కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేణు మాధవ్, ఆర్ శ్రీనివాస్, ఎస్ రమేష్, జి శివ ప్రసాద్, సాయిల సురేశ్, పి శ్రీనివాస్, ఎండి హబీబ్, జే శ్రీనివాస్ రావు, సింగు శ్రీనివాస్, శోభన్ బాబు, డివిఎస్ఎన్ ప్రవీణ్, రాంచరణ్, జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులకు అండగా పీఎం స్వనిధి పథకం

### సారపాక గ్రామపంచాయతీలో అవగాహన సమావేశం నిర్వహణ








**బూర్గంపహాడ్ మహా :** సారపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం వీధి వ్యాపారుల ఆర్థిక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న PM SVANidhi Scheme (పీఎం స్వనిధి) పథకం పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ అధ్యక్షత వహించగా, ఎస్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

**పథకం ముఖ్య విశేషాలు**

సమావేశంలో పీఎం స్వనిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు అందించే రుణాల వివరాలను విపులంగా వివరించారు.

మొదటి రుణం: ₹10,000 (12 నెలల్లో చెల్లింపు)
రెండో రుణం: ₹20,000 (మెరుగైన రిపేమెంట్ రేటింగ్‌తో)
మూడో రుణం: ₹50,000 (వ్యాపార విస్తరణకు)
వడ్డీ సబ్సిడీ: ప్రభుత్వం 7% వరకు భరిస్తుంది

**రుణం పొందే విధానం వివరణ**

లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ, ఈ పథకం కింద రుణం పొందడానికి అవసరమైన ప్రక్రియను వివరించారు. ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, వెండింగ్ సర్టిఫికేట్ వంటి పత్రాలు అవసరమని తెలిపారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా లేదా సంబంధిత బ్యాంకుల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ, రోజువారీ అధిక వడ్డీతో ప్రైవేట్ ఫైనాన్స్ తీసుకుని ఇబ్బందులు పడుతున్న వీధి వ్యాపారులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. "పీఎం స్వనిధి ద్వారా తక్కువ వడ్డీతో రుణం పొందుతూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు" అని ఆయన సూచించారు.

**వ్యాపారుల స్పందన**

సమావేశానికి హాజరైన చిరు వ్యాపారులు పథకం వివరాలను ఆసక్తిగా తెలుసుకుని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకుంటామని తెలిపారు.

**గ్రామస్థులకు పిలుపు**

గ్రామపంచాయతీ అధికారులు అర్హులైన అన్ని వీధి వ్యాపారులు పీఎం స్వనిధి పథకానికి దరఖాస్తు చేసుకుని ఆర్థికంగా బలపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో చిన్న వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించడంలో కీలకమైన అవగాహన పెరిగినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సాయి భోజన్



- గర్భిణులకు,బాలింతలు,డయాలసిస్ పేషెంట్లకు అన్నదానం
- ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమం
- బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

**బెల్లంపల్లి, మహా:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సహకారంతో గర్భిణులకు బాలింతలకు,డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు . ఈ సందర్భంగా ఆస్పత్రిలోని గర్భిణీలు, బాలింతలు, రోగులు,అన్నార్తులు,ఆసుపత్రిసిబ్బంది సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ,బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి మరియు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథిసత్కారంతో ఆదరిద్దాంఅన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లిశంకర్‌రాజేశ్వరిపిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని,మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ సూచించారు ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు, జేరిపోతుల చంద్రకళ సేవకులు పోతురాజుల తిరుపతి, బొడిగేల ఉమేష్ గౌడ్,ఆయిల్లవెంకటేష్తదితరులు పాల్గొన్నారు.

### రైతులను ఇబ్బంది పెడితే

# సహించేది లేదు!

- ధాన్యం కొనుగోళ్లపై మిల్లర్లకు మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక..
- రాత్రి వేళల్లోనూ కొనుగోళ్లు జరపాలి అధికారులకు ఆదేశం..
- జిల్లాలో జోరుగా సాగుతున్న రబీ ధాన్యం సేకరణ..





**నల్గొండ, మహా :** రబీ ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెచ్చరించారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన అన్నదాతను కొనుగోలుదారులు లేదా మిల్లర్లు ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం నల్గొండ జిల్లాలోని నల్గొండ, కనగల్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కనగల్ మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రం తనిఖీ సందర్భంగా లారీల కొరత ఉన్నట్లు నిర్వాహకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన వెంటనే స్పందిస్తూ కాంట్రాక్టరుతో మాట్లాడి కనగల్ కు ఆరు, జి.ఎడవల్లికి ఎనిమిది లారీలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేసిన ధాన్యం కేంద్రాల్లో నిలిచిపోకూడదని అవసరమైతే రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి మరీ సేకరణ పూర్తి చేయాలని సూచించారు. వేసవి కాలం కావడంతో తేమ శాతం, తాలు, తరుగు వంటి సమస్యలు ఉండవని హమాలీల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను కలెక్టర్, అదనపు కలెక్టర్ నేతృత్వంలో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని రైతులు ఎక్కడా ధర్నాలు చేయాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తమది రైతు ప్రభుత్వమని సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వడంతో పాటు దొడ్డు ధాన్యం ధరను కూడా పెంచామని గుర్తు చేశారు. ఐకేపీ మహిళా సంఘాల కోసం 30 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను నిర్మిస్తామని ప్రకటించారు. జిల్లాలో వ్యవసాయాభివృద్ధిపై స్పందిస్తూ ఏఎమ్మార్పీ కాల్వల లైనింగ్ కోసం 450 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీరు రాగానే కనగల్ చెరువును నింపుతామని మంత్రి హామీ ఇచ్చారు. మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలని, వారం రోజుల పాటు పగలు, రాత్రి కష్టపడి కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మరియు ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య నిర్వహణలో

# సమయపాలన పాటించండి

- ఇంటి పన్నుల విషయంలో వేగం పెంచండి
- పచ్చదనానికి నిలయాలు ప్రభుత్వ పార్కులు
- మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



**కుషాయిగూడ, మహా :** కార్పొరేషన్ పరిధిలోని సర్కిల్లలో పారిశుద్ధ్య నిర్వహణలో సమయపాలన పాటించాలని, ఇంటి పన్నుల విషయంలో వేగం పెంచి అనుకున్న లక్ష్యాలను సాధించాలని, పచ్చదనానికి నిలయాలుగా ప్రభుత్వ పార్కులు నిలుస్తున్నాయని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ యాప్రాల్ వార్డులో బుధవారం కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, కీసర డిప్యూటీ కమిషనర్ వసంతతో కలిసి యాప్రాల్ వార్డులో శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పార్కులు తదితర పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ప్రాంతాలలో ఇంటి పన్నులు వసూళ్లలో వేగం పెంచాలని, ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తూ, పారిశుద్ధ్య నిర్వహణ టౌన్ ప్లానింగ్ శానిటేషన్ తదితర కార్యక్రమాల్లో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ పార్కులు పచ్చదనానికి నిలయాలుగా నిలుస్తున్నాయని, పచ్చదనానికి పెద్దపీట వేస్తూ పార్కులను సంరక్షించాల్సిన బాధ్యత సిబ్బందితోపాటు ప్రజలకు కూడా ఉందని తెలిపారు. సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు సూచించారు. అనంతరం యాప్రాల్ వార్డునంతా కలియ తిరుగుతూ వివిధ పనులను పర్యవేక్షిస్తూ రెవెన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత, శానిటేషన్ డి ఈ మాధవాచారి, ఏఎంసీలు వెంకటేష్, శ్రవణ్, గంగన్న, మధుసూదన్ రెడ్డి, నగేష్ బాబు, యు సి డిపార్ట్మెంట్, ఏసిపి శ్రీనివాస్, టి పి ఎస్ స్రవంతి, ఇంజనీరింగ్, ఏఈలు, సర్కిల్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు



**బూర్గంపహాడ్ మహా :** వేసవికాలం దృష్ట్యా బూర్గంపహాడ్ మండల పరిధిలోని మొరంపల్లి బంజర గ్రామపంచాయతీ సర్పంచ్ సుభద్ర బుధవారం గ్రామంలోని ప్రధాన కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆమె ఉప సర్పంచ్ బుక్కుల రవితో కలిసి ప్రారంభించారు. వేసవికాలంలో బాటసారులకు ప్రజలకు దప్పిక తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పుల్లారెడ్డి నాగిరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక శబ్దంతో ప్రయాణిస్తే ఉపేక్షించేది లేదు!



- నల్లగొండలో రోడ్ రోలర్‌తో 72 సైలెన్సర్ల ధ్వంసం..
- నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు
- లైసెన్సులు రద్దు చేస్తామని అదనపు ఎస్పీ రమేష్ హెచ్చరిక..



**నల్లగొండ టౌన్, మహా :** రహదారులపై వెళ్తూ చెవులు చిల్లులు పడేలా శబ్దకాలుష్యం సృష్టిస్తున్న వాహనదారులపై నల్లగొండ జిల్లా పోలీసులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలకు అమర్చిన 72 మాడిఫైడ్ సైలెన్సర్లను బుధవారం పట్టణంలోని క్లాక్ టవర్ కూడలి వద్ద రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కంపెనీ ఇచ్చిన సైలెన్సర్లను కాదని అధిక శబ్దం వచ్చేలా మార్పులు చేసిన వాహనాలను గుర్తించి వాటి నుంచి సైలెన్సర్లను తొలగించారు. అదనపు ఎస్పీ రమేష్ పర్యవేక్షణలో వీటిని బహిరంగంగా ధ్వంసం చేయడం ద్వారా వాహనదారుల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. యువత మోజుతో సైలెన్సర్లను మార్చి సామాన్య ప్రజలను, ముఖ్యంగా వృద్ధులు, రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.ఇకపై మాడిఫైడ్ సైలెన్సర్లతో దొరికితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, పదేపదే నిబంధనలు అతిక్రమిస్తే డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా అధిక శబ్దంతో వాహనాలు నడుపుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవ రావు, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్.ఐలు సైదులు, సైదా బాబు, రాజీవ్ రెడ్డి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మాత శిశు ఆసుపత్రి సంరక్షణకు కృషి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** మాత శిశు ఆసుపత్రి సంరక్షణకు ప్రజలు, ఉద్యోగులు కృషి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా మంచిర్యాలలో మాత శిశు ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఆర్.ఎం.ఓ. శ్రీధర్ లతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాముఖ్యతనిస్తుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం వహించేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. ఆసుపత్రిలో శుద్ధమైన త్రాగునీరు,పోషక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని రోగికి త్వరగా ఆరోగ్యం కుదుటపడుతుందని వెల్లడించారు. గర్భిణీ స్త్రీల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి అత్యున్నత వైద్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆసుపత్రులు, సామాజిక ఆసుపత్రులు, ప్రభుత్వ ఆసుపత్రులు, పల్లె, పట్టణ దవాఖానాలు, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల ద్వారా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రస్తుతం మాతా శిశు ఆసుపత్రి ఉన్న ప్రాంతంలో వరద నీటి ఇబ్బంది ఉన్న కారణంగా పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న ఆసుపత్రికి షిఫ్ట్ చేస్తామని చెప్పారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. లక్షెట్టిపేట సామాజిక ఆసుపత్రి, బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, చెన్నూర్ మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కితాభించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తల నుండి వైద్యుల వరకు గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని వివరించారు. వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం స్టాఫ్ నర్సులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ఆసుపత్రి సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర 2వ మహాసభలను జయప్రదం చేయాలి



**బెల్లంపల్లి,మహా:**బెల్లంపల్లి పట్టణంలో సిపిఐ పార్టీ కార్యాలయంలో డి హెచ్ పి ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్ అధ్యక్షతన రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ దళిత బంధు స్థానంలో దళితులకు అంబేద్కర్ అభయ హస్తం పేరున 12 లక్షల రూపాయలు ఇస్తామని దళితులను దగా చేసిందని, దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచినా దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, బిజెపి ప్రభుత్వం ఏర్పడిన నుండి దళితుల పైన విపరీతంగా దాడులు అత్యాచారాలు పెరిగాయని బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని,. రాజ్యాంగబద్ధమైన సంస్థలను తన గుప్పిట్లోకి తెచ్చుకుని, ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తోందని, రిజర్వేషన్ల అమలులో జాప్యంచేస్తూ,పరోక్షంగా ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణతో సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కిందని పేర్కొన్నారు.మతోన్మాద రాజకీయాలతో ప్రజలమధ్య చిచ్చు పెట్టి, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తోందని, మనువాద భావజాలాన్ని రుద్దడం ద్వారా సమాజాన్ని విడగొట్టే కుట్రలు చేస్తోందని ,కార్పొరేట్ సేవలో కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలసంక్షేమాన్ని విస్మరించి,కొద్దిమంది కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే బిజెపి పనిచేస్తోందని,ధరల పెరుగుదల,నిరుద్యోగంతో సామాన్యుడు అల్లాడుతుంటే,సంపద అంతా కొద్దిమంది చేతుల్లోకి వెళ్లేలా చేస్తూ సామాజిక అసమానతలను పెంచుతోందని,తక్షణమే కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని,ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపి,రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయాలని,ప్రైవేట్ రంగాల్లోనూ రిజర్వేషన్లఅమలు,దళితుల మైనారిటీ లపై జరుగుతున్న దాడులను అరికట్టేలా కఠినమైన చర్యలు తీసుకోవాలని,సామాజిక న్యాయంకోసం,ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం ,అన్ని సామాజిక శక్తులు ఏకమై నియంతృత్వపోరాటాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. డి హెచ్ పీ ఎస్ రాష్ట్ర మహా సభలు ఏప్రిల్ 17, 18 తేదీల్లో వరంగల్ లో జరగనున్నాయని,

**మహాసభల్లో దళితులఅభివృద్ధి**

దళితులపై జరుగుతున్న దాడులు అసమానతలపై సమగ్రమైన చర్చజరిపి భవిష్యత్తుకార్యక్రమాలను రూపొందించుకొని, ప్రజా పోరాటాలకు సన్నద్ధమవుతామని ప్రజలకు పిలుపు నిస్తున్నామనీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆడెపు రాజమౌళి సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి, బొంతల లక్ష్మీనారాయణ మండల కార్యదర్శి, చిప్ప నరసయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు డిఆర్ శ్రీధర్, గుండా చంద్ర మాణిక్యం, రత్నం రాజం, మేకల రాజేశం,కొంకుల రాజేష్ఏ ఐ వై ఎఫ్ జిల్లాఅధ్యక్షులు, గోమాసగంగారం డి హెచ్ పి ఎస్ జిల్లా సమితిసభ్యులు, బొల్లం సోనీ ఎన్ ఎఫ్ ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు, నాయకులు గుండా శంకర్, గుండా ప్రశాంత్, ప్రదీప్,కిరణ్ రాజేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వేసవిలో గిరిజనులకు వరంగా ఇప్పపువ్వు..

## ఇప్పపువ్వు సేకరణతో ఉపాధి..

## అసెంబ్లీ చర్చలతో హాట్ టాపిక్‌గా ఇప్ప సారా..





**మణుగూరు, మహా :** వేసవికాలం మొదలయ్యిందంటే అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు ఉపాధి అవకాశాలు తెరుచుకుంటాయి. ముఖ్యంగా మణుగూరు డివిజన్ అటవీశాఖ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ప్రస్తుతం గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పపువ్వు సేకరణ జోరుగా కొనసాగుతోంది.అడవుల్లో సహజంగా పెరిగే ఇప్ప చెట్ల నుంచి రాలే పువ్వులను సేకరించడం గిరిజనుల ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ఉదయం వేళల్లో కుటుంబ సమేతంగా అడవులకు వెళ్లి పువ్వులను ఏరుకుని, వాటిని ఎండబెట్టి సొసైటీకి విక్రయిస్తున్నారు. దీని ద్వారా వారికి సీజనల్‌గా మంచి ఆదాయం లభిస్తోంది.

**ఆర్థిక ఆధారంగా ఇప్పపువ్వు..**

ఇప్పపువ్వు గిరిజనులకు కేవలం అడవి సంపద మాత్రమే కాదు, ఒక జీవనాధారం.సేకరించిన పువ్వులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి కొంతవరకు మెరుగుపడుతోంది. గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ద్వారా నేరుగా కొనుగోలు జరగడం వల్ల మధ్యవర్తుల సమస్య కూడా తగ్గుతోంది.

**సంస్కృతిలో భాగం ఇప్ప సారా..**

ఇప్పపువ్వుతో తయారయ్యే సాంప్రదాయ మద్యం ఇప్ప సారా.. గిరిజన సంస్కృతిలో కీలక స్థానాన్ని సంపాదించింది. పండుగలు, వివాహాలు, ఆచార కార్యక్రమాల్లో ఇది ప్రత్యేకంగా వాడుతారు. గిరిజనుల దృష్టిలో ఇది కేవలం మద్యం కాకుండా వారి సాంప్రదాయ గుర్తింపుగా భావిస్తున్నారు.

**అసెంబ్లీలో చర్చలతో మళ్లీ ప్రాధాన్యం..**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో గతంలో ఏజెన్సీ ప్రాంత నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇప్ప సార అంశంపై అసెంబ్లీ వేదికగా చర్చలు చేయగా.. ప్రస్తుతం ఈ ఏడాది మార్చి 12వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగిన బడ్జెట్ సెషన్లో కూడా ఇప్పపువ్వు, ఇప్ప సారా అంశం మరల చర్చకు వచ్చింది. జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జె అనిరుద్ రెడ్డి వంటి ప్రజాప్రతినిధులు గిరిజనులకు ఉపాధి కల్పనలో భాగంగా ఇప్ప సారా తయారీకి ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు.అలాగే బిజెపి ఎమ్మెల్యేపి ప్రకాష్‌రెడ్డి కూడా ఈ అంశంపైస్పందిస్తూ గిరిజనుల సంప్రదాయాలకు అనుగుణంగా విధానాలు ఉండాలని అభిప్రాయపడ్డారు.ఈ చర్చలతో ఇప్ప సారా అంశం మళ్లీ తెరపైకి రావడంతో పాటు ఏజెన్సీ జిల్లాలలో ప్రాధాన్యం సంతరించుకుంది.

**చట్టబద్ధతపై గిరిజనుల డిమాండ్..**

ఇప్ప సారా తయారీకి చట్టబద్ధ అనుమతి ఇవ్వాలని గిరిజనులు కోరుతున్నారు.అదే సమయంలో ప్రభుత్వ నియంత్రణలో లైసెన్సుల ద్వారా అనుమతి ఇస్తే గిరిజనులకు ఆదాయం పెరుగుతుందని అక్రమ తయారీ తగ్గుతుందని గిరిజన ఆదివాసి కుటుంబాలు అభిప్రాయ పడుతున్నాయి. వేసవిలో ఇప్పపువ్వు సేకరణ గిరిజనులకు ఉపాధి కల్పిస్తుండగా, అసెంబ్లీ చర్చలతో ఇప్ప సారా అంశం మళ్లీ వెలుగులోకి రావడంతో ప్రాధాన్యతతో ఏజెన్సీ ప్రాంతాల్లో హాట్ టాపిక్ గా మారింది. గిరిజనుల జీవనోపాధి, సంస్కృతి పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.



# మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, మహా :** మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకల ఘనంగా నిర్వహించాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జీఎం కార్యాలయంలోని సమావేశం మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలో ఈ నెల 11 న నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలనిఅధికారులను ఆదేశించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సమావేశంలోసింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, డి.జి.ఎం (పర్సనల్), అశోక్,ఏరియా సివిల్ విభాగం ఎస్.ఈ శ్రీధర్, అడిషనల్ మేనేజర్, కే.కే ఓ.సి శ్రీధర్ గౌడ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఆర్ సత్యనారాయణ,ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ రవి,జీ.ఎం లెవల్ స్ట్రక్చర్ కమిటీ సభ్యులు రమణ పాల్గొన్నారు.



# సదాశివపేట నూతన తహసిల్దార్ గా హరిచంద్ర ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

**సదాశివపేట: మహా:**సదాశివపేట నూతన తహసీల్దార్ గా జి.హరిచంద్ర ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ భూభారతి, ఇతర సర్టిఫికెట్లు, వివిధ అవసరాల కోసం వచ్చేవారు నేరుగా తనను కలవొచ్చని చెప్పారు.



# దశలవారీగా గ్రామాభివృద్ధికి మరింత కృషి

## సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్ యాదవ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** దశలవారీగా సమస్యలు పరిష్కరించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని అయ్యవారిగూడ సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్ యాదవ్ చెప్పారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశ అనంతరం వివేకానంద యూత్ బిల్డింగ్, పాఠశాల ప్రహరీ పునర్నిర్మాణ పనుల్ని సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడారు. ప్రధానంగా వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల్ని ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. ఉప సర్పంచ్ కిషన్ నాయక్, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సెక్రటరీ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి సమాజంలో ఆరోగ్యమే మహాభాగ్యం

## గర్భిణీ స్త్రీలు సరైన వైద్యం, జాగ్రత్తలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సరైన వైద్య సేవలు పొందాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవాలలో భాగంగా బుధవారం ఆరోగ్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల అధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఏర్పాటు చేసిన సురక్షిత మాతృత్వ దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పూర్వకాలంలో శారీరక వ్యాయామం ఉండేదని, కానీ మారుతున్న అలవాట్లకు అనుగుణంగా శారీరక వ్యాయామం తగ్గిందని, దీనికి తోడు మానసిక ఒత్తిడి ప్రతి ఒక్కరిలో పెరగడంతో చిన్న వయస్సులోనే వాధ్యుల బారిన పడటం జరుగుచున్నదని అన్నారు. నేటి సమాజంలో సంపద కన్నా ఆరోగ్యమే ముఖ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు, సరైన పోషకాహారం తీసుకుంటూ ఆశ వర్కర్ల సహాయంతో మెరుగైన వైద్య సేవలు పొందాలని, ప్రభుత్వ ఆసుపత్రిల లో జరుగుతున్న ప్రసవాలు రంగారెడ్డి జిల్లాలో 57% ఉందని తెలిపారు. ఎక్కువ మొత్తంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, శిశు మరణాల రేటును పూర్తిగా తగ్గించాలని వైద్య అధికారులకు సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఒక మహిళకు గర్భ నిర్ధారణ అయిన నాటి నుండి ప్రసవం అయ్యే వరకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రాష్ట్ర, జిల్లాలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలతో కూడా ప్రబలుతున్న డ్రగ్స్ సంస్కృతి గురించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు సూచించారు.



అనంతరం ఎలిమినేడు ప్రాథమిక కేంద్రంలో హెచ్ పివి వ్యాక్సిన్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి వాక్సిన్ వేసుకున్న వారికి సర్టిఫికెట్ అందచేశారు. ఈ వ్యాక్సిన్ వల్ల మహిళల్లో సాధారణంగా వచ్చే గర్భాశయ ముఖ క్యాన్సర్ నుండి నివారించడానికి వాడతారని తెలిపారు. హెచ్ పివి అనే వైరస్ వల్ల వచ్చే ఇతర క్యాన్సర్లను తగ్గిస్తుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యాన్ని రక్షిస్తుందని, 9 నుండి 14 సంవత్సరాల బాలికలకు అత్యంత మంచిదని తెలిపారు. ఈ టీకా పూర్తిగా సురక్షితమైనదని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించినదని, జిల్లా వైద్యం మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తల్లిదండ్రులు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జరుగుతున్న ప్రసూతి సేవలు మరియు ప్రసవానంతర సేవలు సంపూర్ణంగా అందిస్తున్నామని, జిల్లాలో మాతృ మరణాలు సంఖ్య గణనీయంగా తగ్గిందని , హెచ్ పి వి హ్యూమన్ పాపిలోమా వైరస్ అనే వ్యాక్సిన్ రంగారెడ్డి జిల్లాలో 22 సెంటర్లలో ప్రారంభించినట్లు జిల్లా వైద్యమరియు ఆరోగ్యశాఖ అధికారి రంగారెడ్డి జిల్లా డాక్టర్ లలితా దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదమ్, పిడి డిఆర్డిఓ, సీడీపీఓ శ్రీలత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాధిక డాక్టర్ పూనం, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీప్రసన్న, వైద్యాధికారులు డాక్టర్ మోహన్, డాక్టర్ రాజలక్ష్మి, డాక్టర్ సంతోషి, డెమో శ్రీనివాసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి భరోసా తండ్రికి ఉపాధి.!

- కలెక్టర్ చంద్రశేఖర్ మానవత్వం..
- ప్రమాదంలో కాలు కోల్పోయిన బాలికకు కృత్రిమ పాదం..
- జీవనోపాధికి మూడు చక్రాల బండి మంజూరు..





**నల్గొండ, మహా :** కష్టాల్లో ఉన్న వారికి నేనున్నానంటూ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. విధి వంచించిన ఓ చిన్నారి భవిష్యత్తుకు భరోసానిస్తూ ఆమె తండ్రికి ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు తక్షణమే స్పందించారు. కనగల్ మండలం జి. చెన్నారం గ్రామానికి చెందిన చంద్రమౌళి కుమార్తె స్వాతిక (10) కొన్నాళ్ల క్రితం జరిగిన ఒక ప్రమాదంలో దురదృష్టవశాత్తూ తన కాలును కోల్పోయింది. అప్పటి నుంచి ఆ చిన్నారి పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోయిన తండ్రి, బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి తన గోడును వెళ్లబోసుకున్నారు. తన కుమార్తెకు కృత్రిమ కాలు అమర్చాలని, అలాగే కుటుంబ పోషణ నిమిత్తం తనకు ఒక మూడు చక్రాల బండిని మంజూరు చేయాలని విన్నవించారు. బాధిత తండ్రి వినతిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. చిన్నారి స్వాతికకు అవసరమైన కృత్రిమ పాదాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ బాలిక తిరిగి సాధారణ స్థితికి చేరుకునేలా అన్ని రకాల వైద్య సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా చంద్రమౌళి ఉపాధి కోసం మూడు చక్రాల బండిని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.ప్రభుత్వం ఎల్లప్పుడూ నిరుపేదలకు నిస్సహాయులకు అండగా ఉంటుంది. ముఖ్యంగా దివ్యాంగులకు చేయూతనివ్వడంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంది. స్వాతిక భవిష్యత్తుకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.కలెక్టర్ చూపిన చొరవ పట్ల స్వాతిక కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాన్ని గుర్తించి తక్షణమే స్పందించిన కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.



# కన్నెపల్లి పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనుల పరిశీలన

## ..రామగుండంసిపి అంబర్ కిషోర్ ఝా

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి సబ్ డివిజన్లోని కన్నెపల్లి పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణ పనులను బుధవారం నాడు రామగుండం సిపి అంబర్ కిషోర్ఝా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కన్నెపల్లి మండలానికి సంబంధించిన పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి సకాలంలో ప్రారంభోత్సవానికి అందించేలా చర్యలు తీసుకోవాలని, అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను సైతం వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య బెల్లంపల్లి వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు కన్నెపల్లి మండల పోలీస్ స్టేషన్ ఎస్సై భాస్కరరావు లు పాల్గొన్నారు.

# వనపర్తిలో రాజకీయ సెగ

- హరీశ్‌రావు సభకు బ్రేక్
- సర్కార్ నిర్ణయంపై నిరంజన్ రెడ్డి నిప్పులు

**హైదరాబాద్, మహా:** జిల్లాలోని రేవల్లి మండలంలో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం చుట్టూ అలుముకున్న వివాదం ఇప్పుడు రాజకీయ రణరంగంగా మారింది. గత వంద రోజులుగా తమ భూములను కాపాడుకునేందుకు రైతులు చేస్తోన్న పోరాటం ఉద్రిక్త రూపం దాల్చగా, వారికి సంఘీభావం తెలిపేందుకు ఈ నెల 9న నిర్వహించ తలపెట్టిన మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ సభకు ప్రభుత్వం ఆకస్మాత్తుగా అనుమతులు నిరాకరించడం తీవ్ర దుమారం రేపుతోంది. తొలుత సభకు పచ్చజెండా ఊపి, తీరా ఏర్పాట్లు పూర్తయ్యాక ఆఖరి నిమిషంలో అనుమతులు రద్దు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. రైతుల గోడు వినేందుకు వస్తున్న నాయకులను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం తన నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. సభ కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్న తరుణంలో ఆంక్షలు విధించడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన నిలబడతామని, ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించి అయినా సభను నిర్వహించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ గడ్డపై నిర్బంధాలు కొత్తేమీ కాదని, కేసులకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని నిరంజన్ రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, గొల్లపల్లి రిజర్వాయర్ బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం విశ్రమించబోదని తేల్చి చెప్పారు. ఈ నెల 9న నిర్వహించాలనుకున్న సభను ఎట్టి పరిస్థితుల్లోనూ విజయవంతం చేస్తామని, రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది.



# ఇబ్రహీంపట్నంలో విజిలెన్స్ అధికారుల దాడులు...

- అందుబాటులో లేని మండల ఉన్నతాధికారులు
- కీలక ఫైలు కంప్యూటర్ డేటా స్వాధీనం
- రాష్ట్ర విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బుధవారం రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డీజీ శిఖాగోయెల్ ఆదేశాల మేరకు అధికారులు కార్యాలయంపై మెరుపు దాడులు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్న రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టి, కంప్యూటర్లలోని డేటా, కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. పథకాల అమలు, నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలించారు. బయోమెట్రిక్ యంత్రాల ద్వారా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బందిని అధికారులు విచారించడం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జాతీయ స్థాయిలో 'హైడ్రా' మార్కు

## చెన్నై అధికారుల ప్రశంసలు

## ఖానామెట్‌లో రూ.1200 కోట్ల భూమి విముక్తి

**హైదరాబాద్, మహా:**భాగ్యనగరంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా, చెరువులు, నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) పనితీరు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. కేవలం నగరానికే పరిమితం కాకుండా, పొరుగు రాష్ట్రాల యంత్రాంగాన్ని సైతం ఆకర్షిస్తున్న హైడ్రా, తాజాగా తన దూకుడును ప్రదర్శిస్తూ రూ.1,200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణలో రాజీ పడేది లేదని మరోసారి స్పష్టం చేస్తూ, శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో చేపట్టిన ఈ మెరుపు ఆపరేషన్ నగరంలో సంచలనం సృష్టించింది.ఖానామెట్‌లోని సర్వే నంబర్ 55లో ఉన్న సుమారు ఎనిమిది ఎకరాల అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని కొన్ని ప్రైవేటు నిర్మాణ సంస్థలు అక్రమంగా ఆక్రమించి, అందులో తాత్కాలిక షెడ్లు, ఇతర నిర్మాణాలను చేపట్టాయి. దీనిపై పక్కా సమాచారం అందుకున్న హైడ్రా అధికారులు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్నారు. మంగళవారం భారీ బందోబస్తు మధ్య రంగంలోకి దిగిన సిబ్బంది, ఆక్రమణలను నేలమట్టం చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ స్థలం చుట్టూ కంచె వేసి, ఇది ప్రభుత్వ ఆస్తి అని హెచ్చరిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. విలువైన భూములను కబ్జా చేయాలనుకుంటే కఠిన చర్యలు తప్పవని ఈ చర్య ద్వారా గట్టి హెచ్చరికలు పంపారు.మరోవైపు, హైడ్రా అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయి. ముఖ్యంగా వరదల నివారణ, నాలాల పునరుద్ధరణలో హైడ్రా సాధిస్తున్న ఫలితాలను అధ్యయనం చేసేందుకు చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఉన్నతాధికారుల బృందం ప్రత్యేకంగా హైదరాబాద్‌లో పర్యటించింది. చెన్నై వంటి మహానగరాల్లో వర్షాకాలంలో తలెత్తే వరద ముప్పును తప్పించేందుకు హైడ్రా మోడల్‌ను అమలు చేయవచ్చా అనే కోణంలో వారు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అమీర్‌పేట, ప్యాట్నీ నాలాల విస్తరణ పనులను పరిశీలించిన చెన్నై బృందం, ఆక్రమణల తొలగింపులో హైడ్రా ప్రదర్శిస్తున్న చిత్తశుద్ధిని కొనియాడింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆ బృందానికి ఏజెన్సీ పనితీరును, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరును వివరించారు. నాలాల పునరుద్ధరణ ద్వారా వరద నీరు సాఫీగా వెళ్లేలా చూడటంతో పాటు, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిరక్షణకు తాము ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 2024లో ఏర్పాటైన అతి తక్కువ కాలంలోనే హైడ్రా సాధించిన పురోగతి అద్భుతమని సీఎండీఏ అధికారులు ప్రశంసించారు. ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కవచంలా నిలుస్తూ, నగర మౌలిక సదుపాయాల పరిరక్షణలో హైడ్రా పోషిస్తున్న పాత్ర భవిష్యత్తులో ఇతర నగరాలకు దిక్సూచిగా మారే అవకాశం కనిపిస్తోంది.

# కాళేశ్వరం విచారణపై వీడని ఉత్కంఠ

## పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై 22న సర్వోన్నత న్యాయస్థానం తీర్పు

**హైదరాబాద్, మహా.:**తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల విచారణపై సస్పెన్స్ మరికొద్ది రోజులు కొనసాగనుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చట్టబద్ధత, దాని విచారణా సరళిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, తుది తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో అటు అధికార పక్షంలోనూ, ఇటు విపక్ష బీఆర్ఎస్ వర్గాల్లోనూ ఈ విచారణ ఫలితం ఎలా ఉండబోతుందనే అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.ముఖ్యంగా మేడిగడ్డ, అన్నారం వంటి కీలక బ్యారేజీల వైఫల్యాలు, నిర్మాణంలో చోటుచేసుకున్న లోపాలను వెలికితీయడమే లక్ష్యంగా 2024 మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 6 ద్వారా ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. వేల కోట్ల ప్రజాధనం వెచ్చించిన ప్రాజెక్టులో పిల్లర్లు కుంగిపోవడం వెనుక ఉన్న అసలు కారకులను నిగ్గు తేల్చాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. అయితే, ఈ కమిషన్ విచారణ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ గతంలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణలో సహజ న్యాయ సూత్రాలను పాటించడం లేదని, తమ వివరణ తీసుకోకుండానే తుది నివేదిక దిశగా అడుగులు వేస్తున్నారని వారు తమ పిటిషన్లలో అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయస్థానంలో జరిగిన వాదోపవాదాల సందర్భంగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని బలంగా సమర్థించుకుంది. ఇది కేవలం బాధ్యతను నిర్ణయించే ప్రక్రియే తప్ప, రాజకీయ కక్షసాధింపు కాదని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డుల విశ్లేషణ పూర్తయ్యాయని, నిబంధనల ప్రకారమే నోటీసులు జారీ చేశామని కోర్టుకు వివరించింది. ప్రాజెక్టు వైఫల్యం వల్ల రాష్ట్ర ఖజానాపై పడ్డ భారాన్ని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వం తరపు న్యాయవాదులు నొక్కి చెప్పారు. అయితే, కమిషన్ ఏర్పాటు చేసిన విధానం, విచారణ పరిధిపై పిటిషనర్ల తరపు న్యాయవాదులు లేవనెత్తిన సాంకేతిక అంశాలను ధర్మాసనం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.ఈ నేపథ్యంలో, ఈ నెల 22న వెలువడనున్న తీర్పు తెలంగాణ రాజకీయ గమనాన్ని మార్చే అవకాశం ఉంది. ఒకవేళ కమిషన్ విచారణను కోర్టు సమర్థిస్తే, విచారణ ప్రక్రియ వేగవంతమై బాధ్యులపై చర్యలకు మార్గం సుగమం అవుతుంది. అలాకాకుండా ప్రక్రియలో లోపాలున్నాయని కోర్టు భావిస్తే, విచారణ మళ్లీ మొదటికి వచ్చే ప్రమాదం ఉంది. ఏదేమైనా, కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ అలుముకున్న ఈ న్యాయపోరాటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.





# అల్లు అర్జున్ రాకా..

## ఆ టైటిల్ అర్థమేంటో తెలుసా?

టాలీవుడ్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన టైటిల్ వచ్చేసింది. అట్లీ అల్లు అర్జున్ కాంబోలో వస్తోన్న ఈ సినిమాకు ఫుల్ మాస్ టైటిల్ ఖరారు చేశారు. ఇవాళ అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా టైటిల్ అనౌన్స్ చేశారు. ఇప్పటి వరకు వర్కింగ్ టైటిల్‌తో రూపొందించిన ఈ చిత్రాన్ని ఇకపై రాకా అనే పేరుతో తెరకెక్కించనున్నారు. టైటిల్‌తో పాటు రిలీజ్ చేసిన పోస్టర్ సైతం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ టైటిల్ గురించి టాలీవుడ్‌లో నెట్టింట చర్చ మొదలైంది. అసలు రాకా అంటే అర్థమేంటని నెటిజన్స్ తెగ వెతికేస్తున్నారు. మనిషి, మృగం కలగలిపిన పోస్టర్ చూస్తుంటే.. రాక్షసుడనే అర్థం వచ్చేలా టైటిల్ ఎంచుకున్నారా? అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో ద్విపాత్రాభినయంతో పాటు బన్నీ నెగెటివ్ రోల్ చేయనున్నారని టాక్. అది చెప్పేందుకే రాకా పేరును ఎంచుకున్నారేమోనని కొందరు అంటున్నారు. మరికొందరేమో రాకా అంటే.. ప్రతి నెలలో వచ్చే పౌర్ణమిని కూడా అలానే పిలుస్తారని అంటున్నారు. ఎందుకంటే చీకటి, చెడుపై యుద్ధం చేసిన హీరో విజయానికి ప్రతీకగా ఈ పేరు పెట్టినట్లు అభిమానులు భావిస్తున్నారు. పౌర్ణమి రోజు మనుషులు తోడేళ్లుగా మారుతారనే అపోహలు కూడా ఉన్నాయని మరికొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు రాకా అంటే క్రూరత్వం, ప్రమాదకరం, హింస అన్న అర్థాలు కూడా ఉన్నాయని కొందరు చెబుతున్నారు. ఏదేమైనా ఈ ఆసక్తికర టైటిల్‌పై ఎవరికీ తోచింది వారు తమకు నచ్చినట్లుగా అర్థాలు వెతుక్కుంటున్నారు. మరి అసలు అర్థమేంటో మేకర్స్ చెప్తే కానీ తెలిసేలా కనిపించడం లేదు.

# కీర్తి సురేశ్ తాగదు, కానీ అర్ధరాత్రివరకు ఒకటే..



మాతృభాష మలయాళంలో బాలనటిగా రంగ ప్రవేశం చేసి ఆ తరువాత కథానాయికగా పరిచయం అయింది కీర్తి సురేష్. ఆ వెంటనే తమిళం, తెలుగు భాషల్లో హీరోయిన్‌గా నటిస్తూ క్రేజ్ సంపాదించుకుంది. మహానటి చిత్రంతో సత్తా చాటింది. ఈ మధ్య బేబీ జాన్ చిత్రంతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ హిందీ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఏదేమైనా ఇటీవల ఈమె నటించిన చిత్రాలు పెద్దగా సక్సెస్ కాలేదు.

**సినిమా**

కీర్తి చివరిగా నటించిన హిట్ చిత్రం మామన్నన్. ఈమె ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండకు జంటగా రౌడీ జనార్ధన్ చిత్రంలో నటిస్తోంది. తమిళంలో ఈమె నటించిన కన్నివెడి చిత్రం విడుదల కావాల్సి ఉంది. ఇకపోతే కీర్తి సురేష్, హీరోయిన్ సమంత మంచి స్నేహితురాళ్లు అన్నది తెలిసిందే. కాగా నటి కీర్తి సురేష్‌కి మద్యం తాగే అలవాటు ఉందని ప్రచారం జరుగుతోంది.

**ఆ అలవాటు లేదు కానీ..**

దీని గురించి సమంత స్పందిస్తూ.. కీర్తి సురేష్‌కు మద్యం అలవాటు లేదు కాని ఒక్క అలవాటు మాత్రం ఉందని చెప్పింది. అదేమిటంటే హైపర్ మ్యాక్ అనే అధికంగా నవ్వించే గుణం ఉందని తెలిపింది. అర్ధరాత్రి వరకు మాట్లాడుతూ నవ్విస్తూనే ఉంటుందని పేర్కొంది. అదే విధంగా అతి వేగంగా రైమింగ్ మాటలతో ఇతరులను ఆటపట్టిస్తుందని సమంత చెప్పుకొచ్చింది.




# ప్రియుడితో దంగల్ నటి బ్రేకప్..
# ఏడాదికే గుడ్ బై..!

అమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'దంగల్' చిత్రంతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి సన్యా మల్హోత్రా. ఈ చిత్రంలో బబితా కుమారి పాత్రలో ఆడియన్స్‌ను మెప్పించింది. ఆ తర్వాత పలు సినిమాలు, షోలలో కనిపించింది. గతేడాది సన్నీ సంస్కారీ కి తులసి కుమారి, బేబీ జాన్, ది గ్రేట్ ఇండియన్ కిచెన్ లాంటి చిత్రాల్లో కనిపించింది. హిందీలో సినిమాలు చేస్తూ బిజీ ఉంటోన్న ఈ ముద్దుగుమ్మ టోస్టర్, సుందర్ పూనమ్ అనే సినిమాల్లో నటిస్తోంది. ఈ చిత్రాలు డైరెక్ట్‌గా ఓటీటీల్లోనే రిలీజ్ కానున్నాయి.అయితే తాజాగా సన్యా మల్హోత్రాకు సంబంధించి బాలీవుడ్‌లో ఓ టాక్ వినిపిస్తోంది. ఏడాదిగా డేటింగ్‌లో ఉన్న సన్యా తన ప్రియుడు రిషబ్ రిఖీరామ్ శర్మ బ్రేకప్ చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా వీరిద్దరు ఒకరినొకరు సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేసుకోవడంతో బాలీవుడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కాగా.. సన్యా మల్హోత్రా గతేడాది నుంచి ప్రముఖ సితార్ ప్లేయర్ రిషబ్ రిఖీరామ్ శర్మతో డేటింగ్‌లో ఉన్నారు. ఎక్కడికెళ్లినా జంటగా కనిపించి సందడి చేసేవారు. అయితే వీరిద్దరి రిలేషన్‌పై ఎక్కడా కూడా అఫీషియల్‌గా ప్రకటించలేదు. తాజాగా వీరిద్దరు ఏడాదిలోనే తన రిలేషన్‌కు గుడ్ బై చెప్పేశారు. రిషబ్ వేరొకరితో డేటింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అందుకే సన్యా బ్రేకప్ చెప్పేసినట్లు బీటౌన్‌లో లేటేస్ట్ టాక్. గతంలోనూ ఓసారి తనకు బ్రేకప్ అయినట్లు సన్యా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. నాలుగేళ్ల లాంగ్ రిలేషన్ తర్వాత బ్రేకప్ అయినట్లు తెలిపింది.

**రిషబ్ రిఖీరామ్ శర్మ ఎవరంటే?**

రిషబ్ రిఖీరామ్ శర్మ.. రిఖీ రామ్ కుటుంబానికి చెందిన సితార్ ప్లేయర్, సంగీత స్వరకర్త. పురాణ సితార్ వాద్యకారుల కోసం వాయిద్యాలను రూపొందించడంలో ప్రసిద్ధి చెందారు. అతను దిగ్గజ పండిట్ రవిశంకర్ చివరి శిష్యుడు. సితార్ ఫర్ మెంటల్ హెల్త్, ఉచిత మ్యూజిక్ థెరపీ ద్వారా మానసిక ఆరోగ్యం కోసం సెషన్స్ నిర్వహిస్తుంటారు. రిషబ్ తన ప్రదర్శనల ద్వారా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. 2022లో అమెరికాలోని వైట్ హౌస్‌లో నిర్వహించిన మొట్టమొదటి దీపావళి వేడుకలో సోలో ప్రదర్శన ఇచ్చాడు. ఆ తర్వాత పారిస్‌లో జరిగిన 2024 వేసవి ఒలింపిక్స్ ముగింపు వేడుకలో తన ప్రదర్శనతో భారతీయ అథ్లెట్లను అలరించాడు.

# ప్రతి మగాడు చూడాల్సిన సిరీస్ ఇది!




ప్రపంచంలో స్వేచ్ఛకు సరిహద్దు ఉండకపోవచ్చు గాని వ్యక్తిగత స్వేచ్ఛకు మాత్రం హద్దులు, సరిహద్దులతో పాటు పరిమితులు కూడా ఉంటాయి. స్నేహితులైనా, కుటుంబసభ్యులైనా అంతెందుకు కట్టుకున్న భాగస్వామికి అయినా వారి వ్యక్తిగత స్వేచ్ఛకు విలువనివ్వాలి అనే సందేశాన్ని సుస్పష్టంగా ఇచ్చిన సిరీస్ చిరయ్యా. దివి నిధి శర్మ ఆలోచనకు శశాంత్ సింగ్ దర్శకత్వం వహించి తెర రూపమిచ్చిన సిరీసే ఈ చిరయ్యా. చాలా సున్నితమైన అంశాన్ని చక్కటి డ్రామాతో 6భాగాలతో ప్రేక్షకులను కట్టిపడేశాడు దర్శకుడు. పెళ్ళైతే చాలు కట్టుకున్న పెళ్ళాం ఇష్టం తో పని లేకుండా తనని తన సొంత ఆస్తిలా భావించే ప్రబుద్ధులకు ఈ సిరీస్ ఓ గుణపాఠమనే చెప్పాలి. హాట్ స్టార్ లో తెలుగులోనూ లభ్యమవుతున్న ఈ సిరీస్ పెద్దలకు మాత్రమే. కాని చూసిన ప్రతి ప్రేక్షకుడి మనస్సు చివుక్కుమనడం ఖాయం. పెళ్లైన ప్రతి మగాడు చూడాల్సిన సిరీస్ ఇది. అంతలా ఏముందో ఈ సిరీస్ లో ఓసారి చూద్దాం. పెద్దలు కుదిర్చిన సంబంధంతో పూజ అరుణ్ ని పెళ్ళి చేసుకుని అత్తింట్లో అడుగు పెడుతుంది. అత్తమామలు ఇద్దరితో పాటు మిగతా కుటుంబసభ్యులంతా ఎంతో అపురూపంగా చూసుకుంటారు పూజని. ఆ కుటుంబంలో అరుణ్ వదిన దివ్య మొదట్లో పూజని కాస్త బెట్టుగా చూసినా తరువాత కలిసిపోతుంది. అందరూ బాగున్నా అరుణ్ తో పూజకు ఓ సమస్య వస్తుంది. ఆ సమస్య గురించి తాను ఎవ్వరితో చెప్పుకోలేదు. అప్పుడు దివ్యకి పూజ సమస్య తెలుస్తుంది. కన్నబిడ్డ కన్నా ఎంతో అనురాగఆప్యాయతలతో పెంచిన అరుణ్ అసలు స్వరూపం తెలుసుకున్న దివ్య పూజకి ఎలాంటి పరిష్కారం చూపుతుందో చిరయ్యా సిరీస్ చూసే తెలుసుకోవాలి. నిజానికి ఈ సిరీస్ లోని పాయింట్ చాలా సున్నితమైన అంశం. దర్శకుడు ఎక్కడా అశ్లీలతకు ఎక్కువగా తావివ్వకుండా ఎంతో హుందాగా స్క్రీన్ ప్లే రాసుకున్నాడు. అంతే ధీటుగా ప్రేక్షకులకు కూడా ఆకట్టుకునేలా ఉందీ సిరీస్. మరీ ముఖ్యంగా క్లైమాక్స్ లో వచ్చే పరిష్కారం సూపర్ అని చెప్పాలి. పెద్దలు మాత్రమే చూడదగ్గ ఈ సిరీస్ వీకెండ్ కు మంచి కాలక్షేపం.



## ఎన్టీఆర్ లుక్, షూటింగ్‌పై రూమర్స్..

# క్లారిటీ ఇచ్చిన టీమ్

టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్టీఆర్ ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఉన్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డ్రాగన్ (ప్రచారంలో ఉన్న టైటిల్). కేజీఎఫ్ ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. గత నెలలో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. అయితే కొద్దిరోజులుగా తారక్ మేకోవర్ గురించి, అలాగే షెడ్యూల్ రద్దయిందంటూ కొన్ని రూమర్స్ వైరలవుతున్నాయి.

**అందులో నిజం లేదు**

ఈ ప్రచారంపై చిత్రయూనిట్ స్పందించింది. లుక్ గురించి కానీ, షెడ్యూల్ రద్దయినట్లు వస్తున్న ప్రచారంలో కానీ ఏమాత్రం నిజం లేదు. కేవలం చిన్నపాటి విరామాలతో ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారమే సినిమా ముందుకు సాగుతోంది. దయచేసి ఎవరూ తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేయొద్దని, నమ్మవద్దని కోరుతున్నాం అని ట్వీట్ చేసింది. దీంతో తారక్ సినిమా కొత్త షెడ్యూల్ క్యాన్సిల్ అయిందంటూ జరుగుతున్న ప్రచారానికి చెక్ పడినట్లయింది.

**సినిమా**

సినిమా విషయానికి వస్తే.. ఇందులో కాంతార ఫేమ్ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. తాను ఈ సినిమాలో లేనని మలయాళ నటుడు టొవినో థామస్ మీడియా ముఖంగా చెప్పాడు. కానీ అతడి పాత్ర మాత్రం సినిమాలో ఉందని వినికిడి! రవి బస్రూర్ సంగీతం అందిస్తున్న ఈ మూవీని నందమూరి కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

## డెకాయిట్ ప్రీ-రిలీజ్ ఫంక్షన్‌లో
# సుప్రియపై నాగవంశీ ర్యాగింగ్



'డెకాయిట్' సినిమా ప్రీరిలీజ్ వేడుకలో నిర్మాత నాగవంశీ, సహ నిర్మాత సుప్రియపై సరదాగా ర్యాగింగ్ చేశారు. సినిమాలు ఎక్కువ రోజులు తీస్తున్నామని ఎప్పుడూ తమకు క్లాస్ పీకే సుప్రియ ఇప్పుడు రెండు సంవత్సరాలు కష్టపడి 'డెకాయిట్' పూర్తి చేసిందనిక వెక్కిరిస్తూ మాట్లాడారు. మమ్మల్ని సినిమాలు ఎందుకు ఇన్ని రోజులు తీస్తున్నారంటూ సుప్రియ ఎప్పుడూ తిట్టేవారు. కానీ ఇప్పుడు ఆమె రెండు సంవత్సరాలు కష్టపడి 147 వర్కింగ్ డేస్‌లో సినిమా తీశారు. ఇకపై మమ్మల్ని తిట్టే హక్కు ఆమెకు లేదని ఆటపట్టించారు. నిర్మాత కష్టాలు ఎలా ఉంటాయో సుప్రియకు చూపించినందుకు అడివి శేష్‌కు థ్యాంక్స్ చెప్పారు. అలాగే, "హీరోల్ని నెత్తిన ఎక్కించుకున్నామని ఎప్పుడూ క్లాస్ పీకే సుప్రియ, ఇప్పుడు తొలిసారి బయట హీరోతో సినిమా తీస్తే ఎలా ఉంటుందో అనుభవించారు. ఇంతకు ముందు తన ఫ్యామిలీ హీరోలతోనే సినిమాలు తీసిన సుప్రియకు ఈ అనుభవం చాలా ఉపయోగపడుతుంది. డెకాయిట్ సినిమా హిట్ కావాలని కోరుకుంటున్నాను. మరింత మంది హీరోలతో సుప్రియ సినిమాలు చేసి తమలాగే కష్టపడాలని చమత్కరించారు. ఓ వైపు నాగవంశీ సరదాగా ర్యాగింగ్ చేస్తుంటే, పక్కనే ఉన్న సురేశ్ బాబు నవ్వుతూ ఎంజాయ్ చేయడం వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com